ప్రజాశక్తి
మంగళవారం 30 డిసెంబర్ 2025
5
కర్నూలు

బళ్లారి చౌరస్తాలో న్యూ సిటీ కమిటీ ఆధ్వర్యంలో కవాతు

'పదే' లక్ష్యం..!

- విద్యా శాఖ వందరోజుల ప్రణాళిక
- సి, డి గ్రేడ్ విద్యార్థులపై దృష్టి
- పదో తరగతిలో ఉత్తీర్ణతకు నిపుణుల సలహాలు

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

పదో తరగతిలో మంచి మార్కులు సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం వంద రోజుల ప్రణాళికను రూపొందించింది. ఈ మేరకు ఉపాధ్యాయులు ప్రణాళికను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారు. పదో తరగతి పరీక్షలకు సంబంధించి జిల్లాలో 100రోజుల యాక్షన్ ప్లాన్ మొదలైంది. జిల్లాలో 361 పాఠశాలల్లో స్టడీ అవర్స్ జరుగుతున్నాయి. రోజూ పరీక్ష, ఏరోజు పేపర్లు ఆరోజు దిద్ది ఆన్‌లైన్‌లో మార్కుల అప్‌లోడ్ వంటివి వేగవంతంగా జరుగుతున్నాయి. సి, డి గ్రేడ్ విద్యార్థులు పాస్ అవ్వాలంటే ఉపాధ్యాయులు తర్జన భర్జన పడుతున్నారు. కరోనా కాలంలో రెండు సంవత్సరాలు చదువుకు దూరంగా ఫోన్‌లకు బానిసై ప్రాథమిక అంశాలు కూడా చదవలేని రాయలేని విద్యార్థులు, గ్రామాల్లో ప్రతి ఏడాది వలస వెళ్లి వచ్చిన విద్యార్థులు కూడా ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాస్తున్నారు. ఆ విద్యార్థులే సి, డి గ్రేడ్‌గా పరీక్షలకు కుస్తీ పడుతున్నారు. వందశాతం ఉత్తీర్ణత సాధించాలంటే ఏం చేయాలి?. అసలు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమిటి..? అధికారుల ఆలోచన ఏముంది? అనే సందేహాలపై నిపుణుల అభిప్రాయాలు తెలుసుకుందాం.

సబ్జెక్టు ఉపాధ్యాయులు ఒత్తిడికి గురవుతున్నారు

- బి.నవీన్ పాటి, జిల్లా ప్రధాన కార్యదర్శి, యుటిఎఫ్

పదవతరగతి వందరోజుల ప్రణాళిక అమలులో కీలకమైన వ్యక్తి ఉపాధ్యాయుడే. ఇందులో భాగంగా ప్రతిరోజు ఏదో ఒక పరీక్ష 20 మార్కులకు జరుగుతుంది. పరీక్ష పేపరును సిద్ధం చేసుకోవడం సరే. పేపర్లు దిద్ది ఏ రోజు మార్కులను ఆ రోజు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వల్ల ఉపాధ్యాయులు ఒత్తిడికి లోనయ్యే అవకాశం ఉంది. ఈవొక్కటే కాక యాప్స్ భారం, పరీక్ష పే చర్చ, మిడ్ డే మీల్స్ నమోదు, సాసా, ముస్తాబు వంటి కార్యక్రమాలు ఏదో ఒక అధికారి సందర్శన, తనిఖీ, ప్రధానోపాధ్యాయులు ప్రతిరోజూ సర్క్యులర్‌లు, ఇలా 10వ తరగతి బోధించే సబ్జెక్టు ఉపాధ్యాయులు తీవ్రసంఘర్షణ ఎదుర్కొంటున్నారు. ఇంకొంతమంది అధికారులు వీడియోకాల్‌తో స్టడీ అవర్స్ మానిటరింగ్ చేస్తున్నారు. ఇది పదవతరగతి పరీక్ష ఫలితాల మీద ప్రభావం చూపదా? ఇలా చేయడం ఫలితాలిస్తుందా? ఎప్పుడైతే సబ్జెక్టు ఉపాధ్యాయులను బోధనేతర పనులకు దూరం చేస్తే మెరుగైన ఫలితాలు వస్తాయి.

'సిలబస్‌ని అర్థం చేసుకోవడం ముఖ్యం. వెయిటేజీ ఎక్కువగా ఉన్న పాఠాలపై ఎక్కువ దృష్టి సారించాలి. ప్రతి సబ్జెక్టుకు సరిపడా సమయం కేటాయించండి. మీకు కష్టంగా అనిపించే సబ్జెక్టులకు ఎక్కువ సమయం, సులభంగా ఉండే వాటికి తక్కువ సమయం కేటాయించి చదవాలి. రోజువారీగా, వారానికి ఎంత చదవాలనేది ఒక లక్ష్యం పెట్టుకుని, దాన్ని పూర్తి చేయండి. బట్టీకొట్టడం కంటే కాన్సెప్ట్‌ను అర్థం చేసుకోవడం ముఖ్యం. దీనివల్ల సమాధానం మర్చిపోయినా, సొంత మాటల్లో రాయగలరు. చదువుతున్నప్పుడు ముఖ్యమైన పాయింట్లు, ఫార్ములాలు, ఇక్వేలను ఒక చిన్న నోట్స్ బుక్‌లో రాసుకోండి. ఇది పరీక్షకు ముందు రివిజన్‌కు చాలా ఉపయోగపడుతుంది. ఉదయం లేవగానే కష్టమైన సబ్జెక్టులను చదవాలి. పునశ్చరణ , సాధన అవసరం. పాత సంవత్సరాల ప్రశ్నపత్రాలను సాధన చేయాలి. నిర్ణీత సమయంలో పరీక్ష రాస్తున్నట్లుగా ప్రాక్టీస్ చేయాలి. చదివిన దాన్ని వదిలేయకుండా, వారాంతంలో ఒకసారి రివైజ్ చేసుకోవాలి. ఆరోగ్యం , ఏకాగ్రత పెట్టాలి. రోజుకు కనీసం 7-8 గంటల నిద్ర లేకపోతే ఏకాగ్రత దెబ్బతింటుంది. నూనె పదార్థాలు, జంక్‌ఫుడ్ తగ్గించి.. పండ్లు, కూరగాయలు, నీరు ఎక్కువగా తీసుకోవాలి. ఏకధాటిగా గంటల తరబడి చదవకుండా ప్రతి 45-50 నిమిషాలకు ఒక 10నిమిషాల విరామంతీసుకోవాలి. చదువుతున్నప్పుడు ఫోన్, సోషల్ మీడియా, టీవీలకు దూరంగా ఉండాలి.'

ఎ, బి గ్రేడ్ విద్యార్థులు ఇలా చేయాలి

-మారుతీ పౌరోహితం, సీనియర్ లెక్చరర్, డైట్ కళాశాల కర్నూలు

అన్నీ సబ్జెక్టులలో ముఖ్యమైన ప్రశ్నలు నేర్చుకుని ఉంటారు. అదనపు మార్కులు సాధించేందుకు ముఖ్యమైన పాఠ్యాంశాలలో తరచుగా అడిగే ప్రశ్నలను గుర్తించి జవాబులను సాధన చేయాలి. సమాధానం రాసే క్రమంలో ఏ విషయమూ, ఏ ఫార్ములా మిస్ అవ్వకుండా రాయడం వల్ల మార్కులు పెరిగే అవకాశం ఉంటుంది. ఈ విద్యార్థులు బాగా చదువుతారని ఉపాధ్యాయులు వాళ్ళను పట్టించుకోకుండా ఉండ రాదు. వాళ్ళ జవాబు పత్రాలను క్షుణ్ణంగా చూడాలి. ఎక్కడ తప్పు చేసినా మందలింపుగా కాక స్నేహపూర్వక, అభినందన పూర్వక సూచనలు ఇవ్వాలి. ఇలా చేయడం వల్ల మార్కులు పెరిగే అవకాశం ఉంది.

సి, డి గ్రేడ్ విద్యార్థులను ప్రత్యేకంగా చూడాలి

- ఆకెపోగు నాగరాజు, ఉపాధ్యాయులు, కర్నూలు

పదవతరగతి విద్యార్థులు సెల్ ఫోన్‌లకు బాగా అలవాటు పడ్డారు. కరోనాకాలంలో అలవాటైన ఫోన్ క్రమేపి పిల్లలను బానిసను చేసింది. ప్రతి విద్యార్థి ఇన్‌స్టా, ఫేస్ బుక్ అంటూ పుస్తకాలకు దూరమయ్యారు. సామాజిక మాధ్యమాలకు బానిసైన స్థితిని చూస్తున్నాం. దాదాపు సి,డి గ్రేడ్ పిల్లలు దాదాపు వాళ్లే. ఆ విద్యార్థులే చదవలేకపోతున్నారు. రాయలేక పోతున్నారు. ఉపాధ్యాయులు ఏం చెప్పినా వినని స్థితిలో ఉన్నారు. దండన పేరుతో ఈ విద్యార్థులను ఏమీ అనడానికి నిబంధనలు అంగీకరించని కారణంగా ఉపాధ్యాయులు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు. ఈ విద్యార్థులకు అన్ని సబ్జెక్టులలో ఒకటి, రెండు మార్కుల జవాబులను నేర్పించాలి. వీళ్ళను ప్రత్యేకంగా చూడాలి సాధన చేయించాలి. ఈ విద్యార్థులతో ప్రతిరోజూ రాయించడం చేయాలి. వీరికి అందమైన చేతిరాత, తప్పుల్లేకుండా రాయించడం కీలకం.

రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాతు

- జెండా ఊపి ప్రారంభించిన ఎంఏ.గఫూర్

కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న నిర్మల

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

సిఐటియు 18వ అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆ సంఘం కర్నూలు న్యూ, ఓల్డ్ సిటీ కమిటీల ఆధ్వర్యంలో వేర్వేరుగా రెడ్‌షర్ట్ వాలంటీర్లు సోమవారం కవాతు నిర్వహించారు. ఈ నెల 31 నుంచి విశాఖలో నిర్వహించే సిఐటియు అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలనే లక్ష్యంతో కర్నూలు నగరంలో రెడ్‌షర్ట్లు వాలంటీర్లు కవాతు నిర్వహించారు. న్యూసిటీ కవాతు కర్నూలు సుందరయ్య సర్కిల్ కొత్త బస్టాండ్ నుండి ప్రారంభమై బళ్లారి చౌరస్తా, ఎస్‌ఎపి క్యాంప్ మీదుగా బళ్లారి చౌరస్తా నుంచి తిరిగి సుందరయ్య సర్కిల్‌కు చేరుకుంది. కవాతును సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఏ.గఫూర్ జెండాను ఊపి ప్రారంభించారు. సిఐటియు జిందాబాద్ ,సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయండి. లేబర్ కోడ్లను రద్దు చేయాలి, 12 గంటల పని విధానాన్ని రద్దు చేయాలి.. కవాతులో కార్మికులుపెద్ద ఎత్తున నినాదాలుచేశారు. నగర నాయకులు సిహెచ్. సాయిబాబా అధ్యక్షత వహించారు. కర్నూలు ఓల్డ్ సిటీ అధ్యక్షులు అబ్దుల్ దేశాయి అధ్యక్షతన కర్నూలు ఓల్డ్ సిటీ జమ్మిచెట్టు నుండి వన్ టౌన్ మండిబజార్, పెద్ద పార్కుల మీదుగా జిల్లా పరిషత్తు గాంధీ విగ్రహం వరకు వందలాది మంది కార్మికులు ఎర్రని చొక్కాలు ధరించి కవాతు చేశారు. ముఖ్య అతిథి సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఏ గఫూర్, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ పి .నిర్మల, సిఐటియు న్యూ సిటీ ప్రధాన కార్యదర్శి ఆర్.నరసింహులు, జిల్లా నాయకులు టి.రాముడు, ఇన్సూరెన్స్ రంగం రాష్ట్ర నాయకులు రఘుబాబులు కార్మికులనుద్దేశించి మాట్లాడారు. కార్మికులు ఉద్యోగుల సమస్యల పైన మహాసభలో చర్చించి భవిష్యత్తు పోరాటాలకు పిలుపు ఇవ్వబోతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ ను తీసుకువచ్చి 12 గంటల పని చేయాలని, రాత్రి సమయంలో కూడా మహిళలు పనులు చేయాలని చట్టాలను చేస్తూ నిరంకుశంగా వ్యవహరిస్తున్నాయన్నారు. మరో స్వాతంత్ర పోరాటానికి కార్మికవర్గం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. విశాఖపట్నంలో 4 నిర్వహించే భారీ ర్యాలీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. కార్మిక వర్గం చేపట్టిన ఈ రెడ్ షర్ట్ కవాతు పాలకుల గుండెల్లో దడ పుట్టించే లాగా చేసినందుకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. సిఐటియు నగర నాయకులు కె. సుధాకరప్ప, ఎస్‌ఎండి.మహమ్మద్ రఫీ, ఎం.వెంకటేశ్వర్లు, జి.ఏసు, ఆర్. ఓబులేసు, జె.లక్ష్మీబాయి ,శ్యామల ,ఎస్, హుస్సేన్ వలి, హమాలి యూనియన్ నాయకులు మల్లి, కె.రాజు, గోవిందు, సుబ్బారెడ్డి, వెంకటస్వామి, నాగరాజు ,విజయుడు బిసన్న, ఓబ్లేసు, దేవరాజు, ఆంజనేయులు, సురేష్ ,ఎంసీ ఆనంద్, భాస్కర్ ,శ్రీనివాసులు, కె.వి జనార్ధన్ రావు, అజ్మత్, దస్తగిరి ,మౌలాలి, మహిళలు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఓల్డ్ సిటీ రెడ్‌షర్ట్ కవాతుకు ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు, సిఐటియూ నగర ఉపాధ్యక్షులు రాజశేఖర్ ,సివిల్ సప్లై రాష్ట్ర అధ్యక్షులు ఆర్.కృష్ణ మాట్లాడారు. నాయకులు మహమూద్, ఖాజాబాషా, నాగస్వాములు, నాగరాజు, సోలామన్ రాజు, కుమార్, కెవిపిఎస్ నగర అధ్యక్షులు రమణ, కృష్ణ,ఆవాజ్ నాయకులు షరీఫ్, మాభాష, ఖలీల్, సిఐటియు నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో కవాతు

రెవెన్యూ క్లినిక్ ద్వారా సత్వర న్యాయం

- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రెవెన్యూకు సంబంధించిన సమస్యలతో ఇబ్బంది పడుతున్న బాధితులకు రెవెన్యూ క్లినిక్ ద్వారా సత్వరమే న్యాయం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. ఇక్కడ ప్రత్యేకంగా రెవెన్యూ శాఖకు సంబంధించిన అర్జీలను స్వీకరించి వాటిపై బాధితులకు అక్కడికక్కడే పరిష్కారం మార్గాలను తెలియజేసే విధంగా రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. రెవెన్యూ క్లినిక్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, జాయింట్ కలెక్టర్ నూరల్ ఖమర్, డిఆర్ఒ వెంకటనారాయణమ్మ లు పరిశీలించారు. అనంతరం ప్రజా సమస్యలు పరిష్కార వేదిక గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్ జాయింట్ కలెక్టర్లు బాధితుల నుండి అర్జీలను స్వీకరించారు.

అర్జీలు పెండింగులో ఉండకూడదు: కలెక్టర్

కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి మాట్లాడుతూ పిజిఆర్ఎస్ అర్జీలు పెండింగ్‌లో ఉండకూడదని, ఒకే అంశంపై పదేపదే అర్జీలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అర్జీలకు సంబంధించి ఆడిట్ ప్రక్రియలు వేగంగా పూర్తి చేయాలన్నారు. అర్జీదారులతో మాట్లాడి సమస్యలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రతి శాఖలో పనితీరు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. రికార్డులు, నివేదికలు పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫైళ్ల నిర్వహణ పూర్తిగా ఈ-ఆఫీస్ ద్వారానే జరగాలన్నారు. భౌతిక ఫైళ్లు ఉపయోగించకూడదని స్పష్టం చేశారు. ఈపిటిఎస్ ఆన్‌లైన్ పోర్టల్‌లో అవసర డాక్యుమెంట్లు గడువులోగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. కొన్ని శాఖల్లో పురోగతి తక్కువగా ఉందని, వారంలోపు మెరుగుపరచాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పచ్చదనం పెంపొందించేందుకు మొక్కలు నాటాలన్నారు. ఇది పర్యావరణ పరిరక్షణకు, ఆరోగ్యకర వాతావరణానికి తోడ్పడుతుందని తెలిపారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కొండయ్య, అనూరాధ, సునీతాబాయి, నాగప్రసూన అర్జీలు స్వీకరించారు. డిఆర్ఒ వెంకటనారాయణమ్మ, గృహ నిర్మాణ శాఖ పిడి చిరంజీవి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సిరి

హాస్పిటల్‌కు కంప్యూటర్స్‌ను విరాళంగా ఇస్తున్న శ్రీసహస్ర హాస్పిటల్ నిర్వహకులు

జిజిహెచ్ కు కంప్యూటర్స్ విరాళం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు శ్రీ సహస్ర హాస్పిటల్ కర్నూలు వారు మొత్తం రూ. 2,60,000 విలువగల నాలుగు (4) హెచ్. పి (ఆల్ -ఇన్ -వన్ కంప్యూటర్) సిస్టమ్స్‌ను విరాళంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు కు సోమవారం అందజేశారు. డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆసుపత్రి సేవల బలోపేతం కోసం ఈ విరాళం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అత్యవసర సేవలు మరింత వేగవంతం చేయడంలో, రోగుల రికార్డు నిర్వహణలో ఈఆల్‌ఇన్ వన్ సిస్టమ్స్ కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ విలువైన సహకారం అందించిన శ్రీ సహస్ర హాస్పిటల్ వ్యవస్థాపకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. విరాళంగా అందిన ఈ నాలుగు హెచ్ పి (ఆల్ -ఇన్ -వన్) కంప్యూటర్ సిస్టమ్స్‌ను ఆసుపత్రి ఎమర్జెన్సీ విభాగాల్లో వినియోగానికి కేటాయించనున్నట్లు తెలిపారు. ఆసుపత్రి ఆర్‌ఎంఓ డాక్టర్ వెంకటరమణ, శ్రీ సహస్ర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్. రాజేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించండి

-నగరపాలక ఇంచార్జ్ కమిషనర్ ఆర్‌జివి కృష్ణ

-ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 21 అర్జీలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ (ఎఫ్‌ఎసి) ఆర్‌జివి కృష్ణ సూచించారు. సోమవారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ వార్డుల నుండి 21 అర్జీలను స్వీకరించిన ఇంచార్జ్ కమిషనర్ సమస్యల పరిష్కారానికి కృష్ణ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, కార్యదర్శి నాగరాజు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగశివ ప్రసాద్, డిసిపి బి.వెంకటరమణ, ఎంఇ మనోహర్, ఆర్ఓ జునైద్, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, టిడ్కో అధికారి పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు మహాసభను జయప్రదం చేయండి

-జీపుజాతాలో నాయకుల పిలుపు

-జిల్లాను చుట్టేసిన జీపు జాతా

ప్రజాశక్తి - విలేకరులు

గూడూరులో జీపుజాతానుద్దేశించి మాట్లాడుతున్న జె.దివాకర్

ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిలభారత మహాసభలకు జయప్రదం చేయాలని నాయకులు కోరారు. సోమవారం ఉదయం కర్నూలు కొత్తబస్టాండులో ప్రారంభమైన జీపుజాతా గూడూరు, కోడుమూరు, గోనెగండ్ల, ఎమ్మిగనూరు, ఆదోని, పత్తికొండ, ఆస్పరి, దేవనకొండ, వెల్దుర్తి మండలాల మీదుగా కర్నూలు చెన్నమ్మ సర్కిల్‌కు రాత్రి చేరుకుంది. జీపుజాతాను సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ ప్రారంభించారు. సిఐటియుజిల్లా ఉపాధ్యక్షులు జె.దివాకర్, కోశాధికారి ఎం.గోపాల్, ఎపి ఆటోట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ జాతాకు నాయకత్వం వహించారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లో జాతాకు అపూర్వస్వాగతం పలికారు. ఆయా సెంటర్లలో నాయకుల ప్రసంగాలను ప్రజలు ఆసక్తిగా విన్నారు. 29 రకాల చట్టాలను నాలుగుకోడ్లుగా మార్చడాన్ని కార్మికులకు, ప్రజలకు అర్థమయ్యేలా నాయకులు వివరించారు. సిఐటియు ఉద్యమ ప్రస్థానాన్ని వివరించారు.

గూడూరు: మహాసభలను జయప్రదానికి సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన జీపు జాత గూడూరులో సిఐటియు డివిజన్ కార్యదర్శి జె.మోహన్ అధ్యక్షతన నిర్వహించారు. గూడూరు బస్టాండ్ సెంటర్లో నాయకులు మాట్లాడుతూ స్వాతంత్రోద్యమ వారసత్వంలో పుట్టి కార్మిక వర్గ ఆశయానికి అంకితమైన సంస్థ సిఐటియు అని, దేశవ్యాప్తంగా యావత్తు కార్మిక వర్గాన్ని ఐక్యపరచడం సిఐటియు ఆశయమన్నారు. కార్మిక కర్షక ఐక్యతతో పెట్టుబడిదారీ విధానాన్ని కూల్చి కార్మిక రాజ్యాన్ని స్థాపించడం లక్ష్యమన్నారు. స్వాతంత్ర ఉద్యమం నుండి నేటి వరకు కార్మికపక్షాల నిలబడి సిఐటియు కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు అనేక పోరాటాలు చేస్తున్నదన్నారు. కేంద్రప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం దుర్మార్గ మన్నారు. లేబర్ కోడ్స్ వలన కార్మికులను జరిగే నష్టాలను వివరించారు.

పత్తికొండ : పత్తికొండ సిఐటియు మండల కార్యదర్శి ఎం. రవిచంద్ర ఆధ్వర్యంలో మండల కమిటీ ఘనంగా స్వాగతం పలికారు. పత్తికొండ అంబేద్కర్ సర్కిల్ దగ్గర నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా నాయకులు మాట్లాడారు. సిఐటియు పత్తికొండ మండల అధ్యక్షులు గోపాల్, మద్దికేర మండలం కార్యదర్శి బురుజుల రాముడు, పత్తికొండ సిఐటియు ఆటో కార్మిక సంఘం అధ్యక్షులు శేఖర్, సివిల్ సప్లై యామాలి యూనియన్ కార్మికులు పెద్ద హుస్సేన్ పరమేష్ ఆటో కార్మికులు హుస్సేన్ ఎన్టీఆర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేయర్ల సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్.

సర్వేర్ల సమస్యల పరిష్కారం సంక్షేమమే ధ్యేయమని ఆంధ్రప్రదేశ్ సర్వే ఉద్యోగుల సంఘం కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎల్.మద్దిలేటి అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక సి క్యాంప్ లోని డ్రైవర్స్ అసోసియేషన్ భవనంలో జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు మద్దిలేటిఅధ్యక్షత వహించి మాట్లాడారు. ముందుగా ఈనెల 7న జరిగిన సంఘం ఎన్నికల్లో ఎన్నికైన వారితో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం మద్దిలేటి మాట్లాడుతూ సర్వేభవన్ సాధించుటకు ఆంధ్రప్రదేశ్ సర్వే ఉద్యోగుల సంఘం సభ్యులు ఐకమత్యంగా ఉండి నిర్మించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. జిల్లా కేంద్రమైన కర్నూలులో ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్, రెవెన్యూ, డ్రైవర్స్ అసోసియేషన్ తదితర శాఖల వారికి భవనాలు ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాలు కేటాయించుటకు క్షేత్రస్థాయిలో సర్వేయర్ల పాత్ర అందరికీ తెలిసిందే అన్నారు. అయినా ఇంతవరకు సర్వే శాఖకు సర్వేభవన్ లేకపోవడం శోచనీయం అన్నారు. ఈ విషయంపై కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సాధించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గ్రామ సర్వేర్ల సర్వీస్ మేటర్స్ విషయంలో సమస్యలు పరిష్కారానికి జిల్లా కార్యవర్గం పనిచేయాలని సూచించారు. ఇటీవల ఐవిఆర్ కాల్స్‌పై ముగ్గురు గ్రామ సర్వేయర్లు సస్పెన్షన్ కావడం జరిగింది. ఐవిఆర్ కాల్స్‌పై స్పష్టమైన విధివిధానాలు లేకపోవడం వలన గ్రామ సర్వేయర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఒక కొలతకు ఎఫ్ లైన్ పిటిషన్కు సర్వేయర్ వెళ్లినప్పుడు అర్జీదారుని అతని పక్క రైతును తృప్తి పరచడం సాధ్యం కాదు ఒకరికి న్యాయం జరిగింది అనుకుంటే రెండో వ్యక్తికి అన్యాయం జరిగినట్లు భావిస్తారు. అలాంటప్పుడు ఇద్దరినీ తృప్తి పరచడం సాధ్యం కాదనే విషయం ఉన్నతాధికారులు గమనించాల్సి ఉందన్నారు. గ్రామ సర్వేయర్స్‌కు సచివాలయ వ్యవస్థలో స్పష్టమైన విధివిధానాలు లేకపోవడం వల్ల పే ఫిక్సేషన్ ,ప్రమోషన్స్ అన్ని శాఖలకు ఇచ్చిన ఇప్పటివరకు రాలేదు. ఈ విషయంపై జిల్లా స్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేయవలసి ఉందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు నాగేంద్ర, కార్యదర్శి విజయప్రకాష్, సహాయ కార్యదర్శి షాజిదా ఖానం , కోశాధికారి ఎం. రమేష్, నంద్యాల ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మాధవస్వామి, ఎపిఇఎస్ఎ జిల్లా కార్యదర్శి సహదేవుడు, నంద్యాల డివిజన్ అధ్యక్షులు రవి ప్రకాష్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే చెన్నయ్య, కర్నూలు, పత్తికొండ అధ్యక్షులు పి .శంకర్ మాణిక్యం, గాజ లింగన్న, మూడు డివిజన్ల కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు

బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం. ఉపాధ్యాయులు

బాల్య వివాహాలను అరికట్టాలి

ప్రజాశక్తి - కోడుమూరు

బాల్య వివాహాలను ప్రతి ఒక్కరూ అరికట్టాలని హెచ్‌ఎం శాంతమూర్తి తెలిపారు. సోమవారం మండలంలోని కల్లపరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికల వివాహాల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ బాల్య వివాహాల కారణాలు, పేదరికం, విద్య లేకపోవడం, లింగ వివక్షత, సాంప్రదాయ, సంస్కృతి, అవగాహన లేకపోవడం, కూతురి భవిష్యత్తుపై అభద్రతాభావం, బాల్య వివాహాల నిరోధక చట్టాలపై అవగాహన లేకపోవడం, వరకట్న సమస్య, సమాజ ఒత్తిడి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం బాలికలతో ఆటలు ఆడించారు. డ్రాయింగ్, ఎస్సే రైటింగ్ నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ ప్రవీనమ్మ, నాగ రాజకుమారి, ఉపాధ్యాయులు మంగలక్ష్మి దేవి, నాయక్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అలాగే వెంకటగిరి గ్రామంలో విద్యార్థినిలకు, యుక్త వయసు బాలికలకు బాల్య వివాహాలపైన అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్‌ఎం. బాలేందర్ రావు, అంగన్వాడీ సిబ్బంది, మహిళా పోలీస్, అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, ఆయాలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు

ఆర్‌యు ఉద్యోగికి పిహెచ్‌డి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ విశ్వవిద్యాలయంలో నాన్-టీచింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న డి.రంగనాథ్‌కు సిమెంట్ పరిశ్రమలపై పరిశోధన చేసిన నేపథ్యంలో పిహెచ్‌డి డాక్టరేట్‌ను అందజేశారు. రాయలసీమ విశ్వవిద్యాలయం మేనేజ్‌మెంట్ విభాగంలో 'ఆంధ్రప్రదేశ్‌లో సిమెంట్ పరిశ్రమలో ఆర్థిక నిర్వహణ - ఒక అధ్యయనం' అనే అంశంపై డి. రంగనాథ్ చేసిన పరిశోధనకు ఈనెల 27న మౌఖిక పరీక్ష జరిపి డాక్టరేట్ ప్రదానం చేసింది. యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపల్? మేనేజ్‌మెంట్ విభాగ అధ్యక్షుడు ఆచార్య సి.విశ్వనాథరెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ పరీక్షలో రంగనాథ్ విజయం సాధించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ ఆచార్య వి. వెంకట్ బసవరావు, రిజిస్ట్రార్ బి. విజయకుమార్ నాయుడు తోపాటు బోధన, బోధనేతర సిబ్బంది పరిశోధకుడిని అభినందించారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు
- ఎడిఎ మోహన్ విజయ్‌కుమార్

ప్రజాశక్తి - దేవనకొండ



ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఫర్టిలైజర్స్ దుకాణాలు నిర్వహిస్తున్న డీలర్లు ఎరువుల కొరతను సృష్టిస్తే చర్యలు తప్పవని పత్తికొండ ఎడిఎ మోహన్ విజయ్ కుమార్, ఎఒ ఉషారాణి హెచ్చరించారు. సోమవారం దేవనకొండలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఎడిఎ మాట్లాడుతూ... ఎరువుల డీలర్లు, రైతు సేవా కేంద్ర సిబ్బంది ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించినా, ఎరువులను ఇతర ప్రాంతాలకు మళ్లించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువుల లభ్యత వివరాలను రోజూ స్టాక్ బోర్డులో అప్‌డేట్ చేసుకోవాలని తెలిపారు. మండలంలో యూరియా లభ్యత పుష్కలంగా ఉందని, రైతులు వినియోగించుకోవాలని, ఇంకా ఏమైనా అవసరమైతే మళ్లీ తెప్పిస్తామని చెప్పారు.

పట్టాలకు స్థలాలు చూపాలి
- సిపిఎం ఆధ్వర్యంలో లబ్ధిదారుల నిరసన

ప్రజాశక్తి - ఆదోని

నిరసన చేపడుతున్న లబ్ధిదారులు

ఇంటి పట్టాలిచ్చిన అంబేద్కర్ నగర్ ప్రజలకు స్థలాలు, హద్దులు చూపించాలని తహశీల్దార్ కార్యాలయం ముందు సిపిఎం ఆధ్వర్యంలో లబ్ధిదారులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ ఈరన్న మాట్లాడారు. పట్టణంలో ఇంటి స్థలాల కోసం సుమారు 250 మంది అంబేద్కర్ నగర్ 16వ వార్డు ప్రజలు రూ.2,100 డిడిలను కట్టారని తెలిపారు. వారందరికీ ఇంటి పట్టాలు ఇవ్వాలని, ఇంటి పట్టాలిచ్చిన వారందరికీ స్థలాలు చూపించి, హద్దులు చూపించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సర్వే నిర్వహించి పట్టాలు ఇచ్చిన వారందరికీ ఇంటి స్థలాలు చూపించి, హద్దులు చూపించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ శేషఫణికి వినతిపత్రం అందజేశారు. అంబేద్కర్ నగర్ కాలనీ మహిళలు, ప్రజలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

జిల్లా ఉద్యమాన్ని గుర్తించాలి
- మంత్రిని కలిసిన జెఎసి నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని జిల్లా ఇక్కడి ప్రజల ఆకాంక్ష అని, ఉద్యమాన్ని గుర్తించి ప్రజల మనోభావాలను గౌరవించాలని జిల్లా సాధన సమితి జెఎసి నాయకులు కోరారు. టిడిపి జిల్లా అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మ, టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడుతో కలిసి జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి అమరావతిలో వినతిపత్రం అందజేశారు. ఆదోని జిల్లా కోసం గత ఆరేళ్లుగా జరుగుతున్న పోరాటం, ఆదోని జిల్లా ఆవశ్యకత గురించిన ఫైల్‌ను మంత్రికి అందజేశామని జెఎసి నాయకులు నూర్ అహ్మద్, రఘురామయ్య తెలిపారు. ఆదోని జిల్లా ఏర్పాటుపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని చెప్పారు. కొత్త జిల్లాల నోటిఫికేషన్ విడుదలయిన తర్వాత ఆదోని జిల్లా డిమాండ్ వచ్చినందున ప్రస్తుతం ఆదోని జిల్లా ఏర్పాటు విషయం పరిశీలించలేకపోయామని, ఆదోని జిల్లా ఏర్పాటు చేస్తే మిగతా కర్నూలు జిల్లాను ఎలా సర్దుబాటు చేయాలనే విషయంపై అధ్యయనం చేయాలని తెలిపారు. ఆదోని ప్రాంత ప్రజల సెంటిమెంట్‌ను గౌరవిస్తూ నియోజకవర్గాల పునర్విభజన తర్వాత జిల్లా ఏర్పాటును పరిశీలిస్తామని అన్నారు. జిల్లాల పునర్విభజన మంత్రి అనగాని సత్య ప్రసాద్‌తో ఆదోని జిల్లా ఏర్పాటుపై హామీ ఇప్పించేందుకు కృషి చేయాలని మీనాక్షి నాయుడు తెలిపారు. జెఎసి నాయకులు అశోక్‌నంద రెడ్డి, కోదండ, కృష్ణమూర్తి గౌడ్, రామలింగ, అమరేష్, గణేష్, శేఖర్, వీరేష్, దస్తగిరి, అమరేష్, రాజు, సత్యనారాయణ రెడ్డి, టిడిపి అబ్జర్వర్ ధర్మవరం సుబ్బారెడ్డి ఉన్నారు.

మంత్రితో మాట్లాడుతున్న జెఎసి నాయకులు

జాతీయ మహాసభలను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - ఆదోని

ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని నాయకులు కోరారు. సోమవారం ఆదోనికి జీపుజాతా ఆదోనికి చేరుకుంది. ఆదోని సబ్జ బజార్‌లో సిఐటియు పట్టణ అధ్యక్షులు పిఎస్.గోపాల్ అధ్యక్షతన సాగింది. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దివాకర్, కోశాధికారి ఎం.గోపాల్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు, ఎపి ఆటో (ట్రాలీ డ్రైవర్స్) యూనియన్ జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్, పట్టణ కార్యదర్శి తిప్పన్న, సహాయ కార్యదర్శి లక్ష్మన్న, మండల అధ్యక్ష, కార్యదర్శులు జె.రామాంజనేయులు, వీరారెడ్డి మాట్లాడారు. కార్మికుల కష్టాలు, సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 రకాల చట్టాలను రద్దు చేయడం దుర్మార్గపు చర్య అని మండిపడ్డారు. 8 గంటల పని విధానం రద్దు, సమ్మె హక్కు రద్దు, కనీస వేతన హక్కు చట్టం, సామాజిక భద్రత చట్టం తదితర చట్టాల్లో కార్మిక వర్గాన్ని బానిసలుగా చేయడానికి కేంద్ర ప్రభుత్వం పూనుకుందని తెలిపారు. మహాసభలు విశాఖలో ఐదు రోజుల పాటు జరుగుతాయని, 4వ తేదీ బహిరంగ సభలో పాల్గొనాలని కోరారు. ఫుడ్ గ్రెన్స్ హమాలీలు దస్తగిరి, నీలకంఠ, ఈరప్ప, ఎల్లప్ప, ఆటో హనుమంతు, గోపాల్, ఆర్‌టిసి అజీమ్ ఖాన్ పాల్గొన్నారు. **గోనెగండ్ల** జీపు జాతా గోనెగండ్ల చేరుకుంది. స్థానిక వైఎస్‌ఆర్ సర్కిల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కె.ప్రభాకర్, హుస్సేనయ్య మాట్లాడారు. నాయకులు గోపాల్, మోహన్, నబీ రసూల్, వేణు పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** చైతన్య ప్రచార భేరీ ఎమ్మిగనూరుకు చేరుకుంది. సోమప్ప సర్కిల్‌లో సిఐటియు మండల కార్యదర్శి బి.రాముడు అధ్యక్షతన సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దివాకర్, కోశాధికారి ఎం.గోపాల్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు, ఎపి ఆటో (ట్రాలీ డ్రైవర్స్) యూనియన్ జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్, ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి బి.గోవిందమ్మ మాట్లాడారు. సిఐటియు జిల్లా నాయకులు మోహన్, హుస్సేనయ్య, మండల అధ్యక్షులు బి.గోవింద, ఎస్.నాగలక్ష్మి, బి.నీరజ, శిరోమణి, నరసయ్య, ఎం.అబ్దుల్లా, బి.కాల్పు, కె.కృష్ణ, యు.రమేష్, ఎ.సురేష్, బి.గోపాల్, జె.యూనిస్ బాష, జావీద్, రాఘవేంద్ర, పోతప్ప, బి.కేశన్న, కె.ఖాజా, కె.ఇస్మాయిల్, రవి, రంగన్న గౌడ్, తిమ్మన్న, ఎం.రామన్న, రంగముని పాల్గొన్నారు. **ఆలూరులో** జీపు జాతా చేరుకుంది. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెఎస్.నారాయణ స్వామి అధ్యక్షతన అంబేద్కర్ సర్కిల్‌లో ఎపి ఆటో (ట్రాలీ డ్రైవర్స్) యూనియన్ జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్ మాట్లాడారు. సిఐటియు జిల్లా నాయకులు దివాకర్, గోపాల్, కృష్ణ, విఠల్, నాగరాజు, వీరేష్, రంగమ్మ పాల్గొన్నారు.

ఆదోనిలో మాట్లాడుతున్న నాయకులు

గోనెగండ్లలో..

ఎమ్మిగనూరులో

ఆలూరులో మాట్లాడుతున్న నాయకులు

బాబును కలిసిన కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

పార్టీ అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తామని టిడిపి జిల్లా అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మ తెలిపారు. సోమవారం అమరావతి సిఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఆంధ్రప్రదేశ్ జల వనరుల శాఖ మంత్రి, కర్నూలు ఇన్‌ఛార్జీ మంత్రి నిమ్మల రామానాయుడును, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ.జనార్ధన్ రెడ్డిని, బీసీ వెల్ఫేర్ మంత్రి సవితమ్మను మర్యాదపూర్వకంగా కలిశారు. అందరినీ కలుపుకొని వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు.

బాబుకు మొక్కను అందజేస్తున్న కృష్ణమ్మ

ప్రతి ఉద్యోగికీ విరమణ సహజం
- వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రతి ఉద్యోగికీ విరమణ సహజమని వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి తెలిపారు. సోమవారం ఎంఇఒ మోహినుద్దీన్ విరమణ పొందుతున్న నేపథ్యంలో స్థానిక శ్రీపరిమళ విద్యానికేతన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సన్మాన సమావేశంలో ఆయన మాట్లాడారు. మోహినుద్దీన్ కోసిగి, పెద్దకడబూరు, మంత్రాలయం ఎంఇఒగా సేవలు అందించారని తెలిపారు. ఉపాధ్యాయులతో సఖ్యతగా ఉంటూ విధులు నిర్వహించారని చెప్పారు. ఆయన సేవలను నియోజకవర్గ ప్రజలు గుర్తించుకుంటారని తెలిపారు. బాధ్యతగా విధులు నిర్వహించిన మోహినుద్దీన్ శేష జీవితం కుటుంబ సభ్యులతో గడపాలని ఆకాంక్షించారు. అనంతరం మోహినుద్దీన్ దంపతులను ప్రదీప్‌రెడ్డితో పాటు ప్రస్తుత ఎంఇఒ రాఘన్న, రిటైర్డ్ ఎంఇఒ కె.ఈరన్న, ఉపాధ్యాయులు శాలువా, పూలమాలలు వేసి సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.



ఎంఇఒ మొయినుద్దీన్ దంపతులను సన్మానిస్తున్న ప్రదీప్ రెడ్డి

ఎమ్మెల్యే విరుపాక్షికి జగన్ పరామర్శ

ప్రజాశక్తి - చిప్పగిరి

ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి మోకాళ్ల ఆపరేషన్ హైదరాబాదులో చేయించుకున్నారన్న విషయం తెలుసుకున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి సోమవారం ఎమ్మెల్యే విరుపాక్షికి ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. మోకాళ్ల ఆపరేషన్ నొప్పి వారం రోజులకు పైగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని ఆరోగ్య క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం పూర్తిగా నయం అయ్యేంత వరకు తొందరపడకుండా బెడ్ రెస్ట్ తీసుకోవాలని జగన్మోహన్ రెడ్డి సూచించినట్లు ఎమ్మెల్యే విరుపాక్షి ఫోన్ ద్వారా తెలిపారు. జగన్మోహన్ రెడ్డి ఫోన్ చేసి పలకరించడం, ఆరోగ్య విషయాలను తెలుసుకోవడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే విరుపాక్షి చెప్పారు.

ఎమ్మెల్యేను ఫోన్‌లో పరామర్శిస్తున్న జగన్

ప్రజా పరిష్కార వేదిక దరఖాస్తులకు పరిష్కారం
- తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిశీలించి పరిష్కరిస్తున్నామని తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్, పరిపాలన అధికారి శ్రీనివాసులు, ఎఒ శ్రీరామ్ ప్రవీణ్ తెలిపారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులు పాల్గొని సమస్యలతో కూడిన అర్జీలను స్వీకరించారు. ఎంఇఒ సావిత్రమ్మ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఈరమ్మ, హౌసింగ్ అధికారి కృష్ణకుమార్, సీనియర్ అసిస్టెంట్ రామాంజనేయులు, రెవెన్యూ కార్యదర్శి గోవిందప్ప పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి
- ఎఒ వరప్రసాద్

ప్రజాశక్తి - కోసిగి

మండలంలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎఒ వరప్రసాద్ ఆకాంక్షించారు. సోమవారం మండలంలోని డి.బెళగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ ఆదేశాల మేరకు (మెంటర్) సలహాదారుగా నియమించిన ఎఒ పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఉత్తీర్ణత శాతం పెంచేందుకు వంద రోజుల ప్రణాళికలో భాగంగా పాఠశాలలో నిర్వహించే స్టడీ అవర్స్‌ను పర్యవేక్షించడం, విద్యార్థులకు నిర్వహించే డైలీ టెస్ట్‌లను పర్యవేక్షించడం, పరీక్షల పట్ల విద్యార్థులకు ఉండే భయాన్ని పోగొట్టడం, విద్యార్థులు ఎదుర్కొనే అవరోధాలపై చర్చించి వారిని ప్రోత్సహించడం, పాఠశాలకు గైర్హాజరయ్యే విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.వెంకటేశ్వర రెడ్డి, ఉపాధ్యాయులతో చర్చించినట్లు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టిక, విద్యార్థుల మార్కుల రిజిస్టర్‌ను పరిశీలించారు.

తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎఒ, ఉపాధ్యాయులు

2 నుంచి జొహరాపురంలో రీసర్వే

ఆస్పరిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న రీ సర్వే డిటి భీమేష్

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని జొహరాపురం గ్రామంలో జనవరి 2 నుంచి రీ సర్వే నిర్వహిస్తున్నట్లు రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ భీమేష్ తెలిపారు. సోమవారం జొహరాపురం గ్రామంలోని సచివాలయంలో గ్రామసభ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రెవెన్యూ అధికారులకు ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు. భూమి ఉన్న ప్రతి రైతూ పొలాన్ని రీ సర్వే చేసి వారి పొలం హద్దులను సరి చేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల సర్వేయర్ శ్రీనివాసులు, విఆర్‌ఒలు హరికృష్ణ నాయక్, సూర్యనారాయణ రెడ్డి, రైతులు పాల్గొన్నారు. **హోళగుంద** మండలంలోని చిన్నహ్యాట, ఎల్లార్తి గ్రామంలో తహశీల్దార్ నిజాముద్దీన్ ఆదేశాల మేరకు ర్యాలీ నిర్వహించి, రైతులకు అవగాహన కల్పించారు. విఆర్‌ఒ ప్రహ్లాద్ మాట్లాడుతూ... రీ సర్వేకు ప్రతి రైతూ అధికారులకు సహకరించాలని, సర్వే చేసే రోజున పొలానికి సంబంధించిన భూపత్రాలను తీసుకు రావాలని తెలిపారు. చిన్నహ్యాట సర్పంచి హేసన్ బాష, ఎల్లార్తి రాజశేఖర్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు గడ్డం దర్గన్న, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కె.గిరి పాల్గొన్నారు.

హోళగుంద : రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎమ్మిగనూరును జిల్లాగా ప్రకటించాలి
- జెఎసి ఆధ్వర్యంలో రాస్తారోకో - రాఘవేంద్రుని విగ్రహానికి వినతి

ప్రజాశక్తి - మంత్రాలయం

ఎమ్మిగనూరును జిల్లా కేంద్రంగా కూటమి ప్రభుత్వం ప్రకటించాలని జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఎమ్మిగనూరు జిల్లా సాధనకు స్థానిక రాఘవేంద్ర సర్కిల్‌లో రాస్తారోకో నిర్వహించి, రాఘవేంద్ర స్వామి విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు రాజేష్, చిన్ని ప్రసాద్, ఛార్లెస్, రంగయ్య మాట్లాడారు. ఎమ్మిగనూరును జిల్లాగా ప్రకటించే విధంగా చూడాలని రాఘవేంద్ర స్వామిని కోరారు. ఎమ్మిగనూరును జిల్లా కేంద్రం చేస్తూ మంత్రాలయాన్ని పర్యాటక కేంద్రం చేస్తూ విమానాశ్రయాన్ని నిర్మించాలని తెలిపారు. జిల్లాగా మారితే అటు ఆదోని, ఇటు మంత్రాలయం మధ్యలో ఎమ్మిగనూరు ఉండటం వల్ల పెద్ద నగరంగా ఏర్పడుతుందని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. ఆదోని జిల్లాకు ఎలాంటి అడ్డు కాదని, ప్రభుత్వం ఈ రెండు నియోజకవర్గాల మౌలిక, భౌగోళిక పరిస్థితులు పరిశీలించాలని డిమాండ్ చేశారు. లక్షల మంది ఎమ్మిగనూరు జిల్లాకు మద్దతుగా ఉన్నారని తెలిపారు. నియోజకవర్గ నాయకులు హుస్సేని, రంగస్వామి, చిదానంద, లైక్కీ రామ్, నాని, బతుకమ్మ, గోవిందమ్మ పాల్గొన్నారు.

రాస్తారోకో చేపడుతున్న నాయకులు

ఇంటి నివేశ స్థలాలకు దరఖాస్తు : ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ఇంటి స్థలాలు లేని నిరుపేదలు ఇంటి నివేశ స్థలాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని రాంపురం గ్రామంలోని ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలోని ఇంటి స్థలాలు లేని ప్రజలు ఆధార్ కార్డులతో గ్రామ సచివాలయాలకు వెళ్లి వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న అనంతరం సచివాలయంలో వివరాలు నమోదు చేసి, రశీదు లేదా నమోదు సీరియల్ నెంబర్‌ను తప్పకుండా తీసుకోవాలని పేర్కొన్నారు.

సోలార్ ప్యానెల్‌ను సద్వినియోగం చేసుకోండి

విద్యుత్ శాఖ ద్వారా లభించే సోలార్ ప్యానెల్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కోరారు. సోలార్ ప్యానెల్‌లో 1 కెవి ప్యానెల్‌కు రూ.60 వేలు ఖర్చు అవుతుందని, ఇందులో రూ.30 వేలు రాయితీ పోగా రూ.30 వేలు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. అదే 2 కెవికి రూ.1.20 లక్షలు కాగా రూ.60 వేలు రాయితీ లభిస్తుందని, 3 కెవికి రూ.1.80 లక్షలు ఖర్చు కాగా రూ.78 వేలు చెల్లించి పొందాలని తెలిపారు. అవసరమైన వారికి అన్ని రకాల బ్యాంకుల్లో రుణ సౌకర్యం కల్పిస్తుందని పేర్కొన్నారు.

మండలాల విభజన హర్షణీయం
- కురువ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప

ప్రజాశక్తి - ఆదోని

మాట్లాడుతున్న మాన్వి దేవేంద్రప్ప

ఇచ్చిన హామీ మేరకు ఆదోని నియోజకవర్గాన్ని రెండు మండలాలుగా విభజించడం హర్షణీయమని కురువ కార్పొరేషన్ ఛైర్మన్ మాన్వి దేవేంద్రప్ప కొనియాడారు. సోమవారం గ్రామం నుంచి వందలాది మంది ఆదోని పట్టణంలోని శ్రీనివాస్ భవనం మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన చేపట్టారు. ఆదినారాయణ రెడ్డి, నాగరాజు, మధు, రాము, గర్జప్ప, మారెప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదోని, పెద్దహరివాణం మండలాలుగా విభజించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదోని ప్రజల కష్టాలను గుర్తించి ఆదోని మండలంలో అతి పెద్ద గ్రామమైన పెద్దహరివాణం గ్రామాన్ని మండలంగా ప్రకటించిందని చెప్పారు. పెద్దహరివాణం మండలం అన్ని విధాలుగా సౌకర్యంగా ఉంటుందని ప్రజలకు వివరించారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా పెద్దహరివాణం మండలం కేంద్రంగా ఏర్పాటు కావడం తథ్యమన్నారు. రాజకీయాలకతీతంగా ప్రజలు కలిసికట్టుగా ప్రదర్శనలో పాల్గొన్నారు.

జిల్లాస్థాయిలో 'నారాయణ' ప్రభంజనం

ప్రజాశక్తి - ఆదోని

జిల్లాస్థాయి క్రీడల్లో ఆదోని నారాయణ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని ప్రధానోపాధ్యాయులు లక్ష్మిరెడ్డి తెలిపారు. కర్నూలు వైబి నారాయణ పాఠశాలలో జిల్లాస్థాయి నారాయణ ప్రీమియర్ లీగ్ క్రీడా పోటీలు జరిగాయి. పోటీలను విద్యాసంస్థల ఎజిఎం రమేష్ కుమార్ ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలను చేసి క్రీడలను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ... చదువులంటే కేవలం పుస్తకాలతో కుస్తీ పట్టడం కాదని, బాలల సంపూర్ణ ఎదుగుదలకు బాటలు వేసే ఆటలు ఆడాలని తెలిపారు. క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం అలవడుతుందని చెప్పారు. ఆదోని నారాయణ విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్‌గా నిలవడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. అనంతరం లక్ష్మిరెడ్డి మాట్లాడారు. ఆదోని విద్యార్థులు చదువులోనే కాకుండా.. ఆటల పోటీల్లోనూ ఓవరాల్ ఛాంపియన్‌గా నిలవడం గర్వంగా ఉందని చెప్పారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

జయ కేతనం చూపుతున్న విద్యార్థులు

దేవాలయ అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీలక్ష్మీ నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామివారి దేవాలయ అభివృద్ధికి మాచాపురం గ్రామానికి చెందిన బి.వరలక్ష్మి, వెంకటేశ్వరరెడ్డి రూ.53,680 విరాళంగా చెల్లించారని అధికారులు తెలిపారు. సోమవారం వారు మాట్లాడారు. దాతలకు శ్రీస్వామి వారి శేషవస్త్రాలు, లడ్డు ప్రసాదం ఇచ్చి దర్శనం సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. దేవాలయం అర్చకులు వీరేంద్ర స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

విరాళం అందజేస్తున్న దాతలు

విధుల్లో చేరిన సిఐ చంద్రబాబు

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల సిఐ జి.చంద్రబాబు సోమవారం విధుల్లో చేరారు. ఇక్కడ సిఐగా పని చేస్తున్న విజయభాస్కర్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో చంద్రబాబు గోనెగండ్ల అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సిఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో ఆదోని, నందికొట్కూరు స్టేషన్లలో ఎస్‌ఐగా పని చేసి సిఐగా ప్రమోషన్ పొంది శ్రీశైలం టూ టౌన్‌లో విధులు నిర్వహిస్తూ బదిలీపై గోనెగండ్లకు వచ్చారు. ఆయన మాట్లాడుతూ... తమ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా న్యాయం కోసం వచ్చేవారికి అండగా ఉండి సేవలు అందజేస్తామని తెలిపారు. నూతన సిఐకి టిడిపి మండల కన్వీనర్ తిరుపతయ్య నాయుడు, ప్రధాన కార్యదర్శి రమణ చౌదరితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పూలమాల, శాలువాలతో స్వాగతం పలికారు.

సిఐకి స్వాగతం పలుకుతున్న టిడిపి నాయకులు

క్రైస్తవులకు అండగా ఉంటాం
- టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని నియోజకవర్గంలో క్రైస్తవులకు అండగా ఉంటామని టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు తెలిపారు. సోమవారం ఆయన కార్యాలయంలో పాస్టర్ల సమక్షంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా క్రైస్తవులకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు దశలవారీగా అమలు చేస్తున్నారని తెలిపారు. పాస్టర్లకు కూటమి ప్రభుత్వం గౌరవ వేతనం అందజేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ, అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా చంద్రబాబు నాయుడు పాలన సాగుతోందన్నారు. పాస్టర్లు ఆనంద్ రాజ్, ఎజ్రా శ్రీధర్, ఎమ్మెస్.రావు, బెనర్జీ, థామస్, ఆశీర్వాదం, రాజు, నథానియేల్, అనిల్, ఆదోని టిడిపి క్రిస్టియన్ సెల్ ప్రెసిడెంట్ అమర్ ప్రకాష్, నాయకులు రంగస్వామి నాయుడు, జిందే శంకర్, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆరెకల్ రామకృష్ణ, రంగన్న, శివప్ప, లక్ష్మీనారాయణ, జయ రామ్, రవి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉమాపతి నాయుడు

ఆరుగురు జూదరుల అరెస్టు
- ఎస్ఐ తిమ్మారెడ్డి

ప్రజాశక్తి - నందవరం

గత కొద్దిరోజులుగా పేకాట స్థావరాలపై నందవరం ఎస్ఐ తిమ్మారెడ్డి ఉక్కుపాదం మోపుతున్నారు. నిరంతరం దాడులతో జూదరుల భరతం పడుతున్నారు. ఆదివారం కనకవీడు గ్రామంలో పేకాట ఆడుతున్న పది మందిని అరెస్టు చేశారు. సోమవారం సాయంత్రం రాయచోటి గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. రాయచోటిలో గురజాలకు వెళ్లే దారిలో స్కూలు పక్కన కంపచెట్ల కింద పది మంది పేకాట ఆడుతుండగా వారిని పట్టుకోవడానికి ప్రయత్నించినట్లు చెప్పారు. నలుగురు వ్యక్తులు తప్పించుకోగా, ఆరుగురిని అరెస్టు చేశామన్నారు. వారి దగ్గర నుంచి రూ. 8,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం వారిపై కేసు నమోదు చేశామన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ

IN THE COURT OF THE DEPUTY REGISTERAR OF CHITS AT BALLARI DISPUTE No. 80/2025-26

Between
Mis Dhanalakshmi Srinivasan Chit Funds (Karmataka) Pvt. LtdBallari, Rep by its Manager/Foreman. ...Disputant

-VS-

Mr. K.B.Narasimhudu & Others. ...Opponents

NOTICE TO OPPONENTS TO 01 TP 6

1) Mr.K.B. Narasimhudu S/o.K.Narasimhudu, aged 48years Residencel (No:87-1187-5E NR. Revenue Colony, Road No.17, Near Ramkrishna Mission, B-Camp, Kurnool (town) Kumool (dist) 518002
2) Mrs V. Rukmini, S/o.K.B.Narasimhudu, aged 47years, Residence Na, 87-1187-5E NR. Revenue Colony, Road No.17, Near Ramkrishna Mission B-Camp. Kurnool (town) Kurnool (dist) 518002
3) Mr.Y.Prabhakar Reddy S/o Y.Veera Reddy, aged 41 years Residence HNo,1-10.Bollaram (vip) Kalluru(M), Kurnool (Dist) 518210
4) Mr.V, Nirmal Kumar S/o.V.Veeraiah, aged 59 years Working as a Secondary Grade Teacher, Municpal Corporation Primary School, 27 Peta (Spl), Chinna Market Kurnool (Town) Residence HNo:87/1304-3F-F-203 Sri Sai Sannidhi Residenty Near Hosanna Mandir Swamy Setty Nagar Kurnool-518002
5) Mr.B.Siva Prasad Reddy 5/o Santhi Reddy, aged 52 Residing: 87/1369-104 Maruthi, Nagar Near Judicial Colony. Nandikatkur Road Kurnool (Town)
6) M.T.Vijay Kumar S/o.T.Venkatesh aged 43 Years, Residence #3-123, 9-64, TEMPLE STREET KYATHUR Temple Street, Kyathur Village Alampur (M) Gadwal (Dist)
....OPPONENTS

Whereas the above named disputant has instituted a claim for recovery of Rs. 14,77,738-00/-against you are hereby summoned/notice to appear in this Hon'ble court of Deputy Registrar of Chit the 31 day of Dec 2025 at 0/0 Deputy Registrar of chits, at Ballari Janathe Bazar, Station Road Ballari, at 3:00 PM to answer the afore said claim and you are directed to Produce on that day all the documents upon which you intend to rely in support of your defense.

Take notice that, in default of your appearance on the day before mentioned, the claim will be heard and determined in your absence.Give under my hand and seal of the Court on this th 02 day Dec 2025.

Deputy Registrar of Chits, Ballari

చెత్తాచెదారాన్ని శుభ్రం చేస్తున్న సిబ్బంది

ఆర్‌టిసి ఎమ్‌డి రాకతో.. బస్టాండ్ శుభ్రం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో ఉన్న ఆర్‌టిసి బస్టాండ్ తనిఖీకి ఆర్‌టిసి ఎమ్‌డి, వైస్ ఛైర్మన్ సి.హెచ్.ద్వారకా తిరుమల రావు వస్తున్నారన్న సమాచారంతో బస్టాండ్ శుభ్రతకు అధికారులు చర్యలు చేపట్టారు. సోమవారం రాత్రి రాఘవేంద్ర స్వామిని దర్శించుకునేందుకు వస్తున్న నేపథ్యంలో అధికారులు ఆర్‌టిసి బస్టాండ్ ప్రాంగణంలో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి నిప్పు పెట్టారు. దేశంలోనే రెండో తిరుమలగా వెలుగొందుతున్న మంత్రాలయం క్షేత్రం ఆర్‌టిసి బస్టాండ్ సమస్యల వలయంలో కొట్టు మిట్టాడుతోంది. ప్రధాన రహదారికి ఆర్‌టిసి బస్టాండ్ తగ్గులో ఉండడం వల్ల డ్రైనేజీ వ్యవస్థ లేక నిత్యం కంపు కొడుతోంది. రాత్రి వేళల్లో మందు బాబులకు కేంద్రంగా మారిందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భద్రత లేని ఆర్‌టిసి బస్టాండ్ తనిఖీ కోసం వచ్చే ఎమ్‌డి అయినా దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారేమో వేచి చూడాల్సిందే.

శ్మశానానికి రోడ్డు కరువు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

చెత్తతో నిండిన శ్మశానానికి వెళ్లే రోడ్డు

ప్రజాశక్తి - కోసిగి

స్థానిక తొమ్మిదో వార్డులోని బీరప్ప దేవాలయం ముందు నుంచి శ్మశాన వాటికకు వెళ్లే దారి చెత్తతో నిండి ముళ్లపొదలు పెరిగాయి. రహదారి లేకపోవడంతో కాలనీ వాసులతో పాటు హిందూ శ్మశానానికి వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పక్కనే పెద్ద డ్రైనేజీ ప్రవహించడంతో డ్రైనేజీకి ఇరువైపులా సిమెంట్ కట్టడం లేకపోవడంతో మురుగునీటితో పాత రోడ్డు సైతం కోతకు గురయింది. ఈ రహదారి వెంట పొలాలకు వెళ్లే కూలీలు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాలు మారినా ఈ రహదారి మాత్రం బాగుపడడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా అధికారులు, నాయకులు స్పందించి నూతన రోడ్డు మంజూరు చేసి, రహదారి పక్కనే ఉన్న పెద్ద డ్రైనేజీకి ఇరువైపులా సిమెంట్ కట్టడాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దీక్ష ఫలించిందని నాయకుల సంబరాలు

- గోపాల్ రెడ్డి దీక్షను భగ్నం చేసిన పోలీసులు

ప్రజాశక్తి - ఆదోని

పెద్దహరివాణం వద్దు అంటూ చేపట్టిన దీక్ష ఫలించిందని నాయకులు సంబరాలు చేసుకున్నారు. 16 గ్రామాల తరపున శుక్రవారం నుంచి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆమరణ నిరాహార దీక్షకు కూర్చున్న గోపాల్ రెడ్డి దీక్షను పోలీసులు ఆదివారం భగ్నం చేశారు. ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్సలు అందించారు. మెరుగైన వైద్యం కోసం ఓ ప్రయివేట్ హాస్పిటల్లో చేర్పించారు. అక్కడి నుంచి డిశ్చార్జి అయిన గోపాల్ రెడ్డిని సోమవారం ఆయన అభిమానులు బైక్ ర్యాలీ నిర్వహించి సంబరాలు చేసుకున్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆదోని ప్రాంత ప్రజల దశాబ్దాల కల, నెల రోజుల సుదీర్ఘ పోరాటం ఫలించిందన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం ఆదోని మండలాన్ని ఆదోని-1, ఆదోని-2 మండలాలుగా విభజిస్తూ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందన్నారు. నాయకులు వెంకటేష్ చౌదరి, వీరేష్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గోపాల్ రెడ్డి

'డయల్ యువర్ సిఎండి'కి 50 వినతులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఎపిఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహించిన 'డయల్ యువర్ ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి' కార్యక్రమం ద్వారా 50 వినతులు అందినట్లు ఆ సంస్థ ఛైర్మన్ , మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. సంస్థ పరిధిలోని తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను విన్నవించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరులో జాప్యం, విద్యుత్ లైన్ మార్పు, లో-ఓల్టేజ్ సమస్య, ట్రాన్స్ ఫార్మర్ల సామర్థ్యం పెంపు, విద్యుత్ సరఫరాలో ఉంటుందని అంతరాయాలు, బిల్లింగ్ తదితర సమస్యలు వీటిలో వున్నాయి. వినియోగదారుల సమస్యలపై సిఎండి శివశంకర్ లోతేటి మాట్లాడుతూ విద్యుత్ సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని తెలిపారు. దీర్ఘకాలిక విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే, వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారమే ధ్యేయంగా ఆయా జిల్లా స్థాయిల్లో కూడా ప్రతి సోమవారం ఉదయం 8:30 గంటల నుంచి 9:30 గంటల వరకు "డయల్ యువర్ ఎస్ఇ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912 లేదా 1800 425 155333కు కాల్ చేయడం లేదా వాట్సాప్ నంబరు: 9133331912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు.

విద్యుత్ బిల్లుల వసూలుకు ప్రాధాన్యం.

ఎపిఎస్‌పిడిసిఎల్ పరిధిలో మంగళవారం జరుగనున్న 'కరెంటోళ్ళ జనబాట" కార్యక్రమంలో విద్యుత్ సమస్యల పరిష్కారంతోపాటు విద్యుత్ బిల్లుల వసూళ్లకు కూడా సిబ్బంది ప్రాధాన్యత ఇవ్వాలని సిఎండి శివ శంకర్ లోతేటి సూచించారు. నెలాఖరు కారణంగా విద్యుత్తు బిల్లుల వసూళ్ల శాతం తగ్గకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్‌కె. గురవయ్య, డైరెక్టర్/ ఫైనాన్స్(ఎఫ్‌ఎసి) కె. రామ మోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు పిహెచ్. జానకి రామ్, జె. రమణా దేవి, కె.ఆదిశేషయ్య, ఎం.మురళీకుమార్, ఎం.ఉమాపతి, జనరల్ మేనేజర్లు కృష్ణారెడ్డి, రామచంద్ర రావు, చక్రపాణి, సురేంద్ర రావు, భాస్కర్ రెడ్డి. జగదీష్, ప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఎండి శివశంకర్ తోలేటి

రాష్ట్రస్థాయి రగ్బీపోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు జిల్లా పరిషత్

11వ రాష్ట్ర స్థాయి రగ్బీ సబ్ జూనియర్ పోటీలను కర్నూలు కు చెందిన గ్యాస్ట్రో ఎంట్రాలజీ డాక్టర్ శంకర్ శర్మ ప్రారంభించారు. కకర్నూలు ఆదర్శ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న ఈపోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్రంలోని 15 జిల్లాల క్రీడాకారుల పాల్గొన్నారు. ఈపోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జాతీయ జట్టుకు ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథి డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో సైతం పాల్గొనాలని కోరారు. క్రీడల్లో రాణిస్తే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తుందని, అందుకు భారత మహిళా క్రికెట్ జట్టు నిదర్శనం అన్నారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొంటే చదువుల్లో రాణించడంతో పాటు భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలు సైతం క్రీడా కోటలో వస్తాయని డాక్టర్. శంకర్ శర్మ తెలిపారు. విద్యార్థులు సెల్ ఫోన్‌కు దూరంగా ఉండి మంచి ఆహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని డాక్టర్. శంకర్ శర్మ సూచించారు. ఈకార్యక్రమంలో క్రీడా ప్రతినిధులు రామాంజనేయులు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులనుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డాక్టర్ శంకర్‌శర్మ

ఆదోనిని జిల్లాగా ప్రకటించాలి

- కలెక్టరేట్ ముట్టడించిన ఆదోని జెఎసి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఆదోని జిల్లా ఏర్పాటు కోసం సోమవారం కలెక్టరేట్ కార్యాలయాన్ని ఆదోని జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం ముట్టడించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ గేట్లను తెరచుకుని లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన జేఏసీ నాయకులను పోలీసులు నిలువరించారు. కొద్దిసేపు జేఏసీ నేతలకు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ సిరి అక్కడికి చేరుకుని జేఏసీ నేతల నుండి వినతి పత్రాన్ని స్వీకరించారు. ఆదోని జిల్లా ఏర్పాటు డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని జిల్లా కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. జెఏసి నాయకులు ఉదయ్, తిరుమలేష్, ఖాజా రమేష్, ఉదయ్ కృష్ణ, ఆఫ్రిది, రఘు, దస్తగిరి, అఖండ మాట్లాడుతూ కర్నూల్ పశ్చిమ ప్రాంతంలోని మంత్రాలయం, ఎమ్మిగనూర్, ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో కరువు, వలసలు, నిరక్షరాస్యత శాతం తగ్గాలంటే ఆదోనిని జిల్లాగా చేయాలని డిమాండ్ చేశారు. ఆర్డీఎస్ కుడి కాలువ, గుండ్రేవుల, వేదవతి, సమాంతర కాలువల పూర్తి, చేయాలన్నారు.

ఎమ్మిగనూరులో హార్టికల్చర్, వెటర్నరీ యూనివర్సిటీలు, టెక్స్టైల్ పార్క్, పత్తికొండలో జ్యూస్ ఫ్యాక్టరీ, నేషనల్ హైవేలు కలిపే సూపర్ ఎక్స్‌ప్రెస్ హైవేల ఏర్పాటు చేయాలని కోరారు. పార్టీలకు అతీతంగా ప్రజలను ఏకం చేసి ఆందోళన చేస్తున్నా పాలకులు స్పందించడం లేదని ఆందోళన వక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించక పోతే పెద్ద ఎత్తున ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి కలుగజేసుకుని సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. రాయలసీమ విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు సీమ కృష్ణ, భాస్కర్, రవి తదితరులు సంఘీభావం తెలిపారు.

జెఎసి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆందోళన కారులు

కలెక్టరేట్ డాక్టర్ ఎసిరికి వినతిపత్రం ఇస్తున్న జెఎసి నాయకులు

భవన నిర్మాణ కార్మికుల బతుకులు మారలేదు

భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు కుమార్

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

ప్రభుత్వాలు మారుతున్నా భవన నిర్మాణ కార్మికుల తలరాతలు మారలేదని భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు కుమార్, నాయకంటి మద్దిలేటి ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లా కల్లూరు పట్టణంలో నూతనంగా ఏర్పాటుచేసిన భవన నిర్మాణ కార్మిక సంఘం భవనాన్ని ఘనంగా ప్రారంభించారు. కల్లూరు పట్టణంలో భవన నిర్మాణ కార్మికుల చిరకాల స్వప్నం నెరవేరింది. కార్మిక సంక్షేమ కార్యాలయం నుండి విచ్చేసిన కార్మిక శాఖ జిల్లా అధికారులు షమీర్ బాష, శేషన్న, నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి, కార్పొరేటర్ నరసింహులు ముఖ్య అతిథులుగా హాజరై, రిబ్బన్ కట్ చేసి ఈ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్మిక శాఖ అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను కార్మికులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్మిక కార్డుల ప్రాముఖ్యతను వివరించారు. సంఘం గౌరవ అధ్యక్షులు కుమార్, నాయకంటి మద్దిలేటి మాట్లాడుతూ ఏ ప్రభుత్వం వచ్చినా కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాలుగో పట్టణ ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కార్మికుల భద్రత విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సూచించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు, పెద్ద సంఖ్యలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

ఆయా, నైట్ వాచ్‌మెన్‌లకు వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ (ఆయా) కార్మికులు, నైట్ వాచ్‌మెన్‌లకు నెలలతో పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్‌కు .సిఐటియు జిల్లా అధ్యక్షుడు పిఎస్. రాధాకృష్ణ, నగర ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు, నగర ఉపాధ్యక్షుడు డి.కుమార్, నైట్ వాచ్‌మెన్ యూనియన్ నాయకుడు కృష్ణ, ఆయా నాయకులు అయ్యమ్మ, సురేఖలు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల్లో తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని అన్నారు. పండుగల సమయంలో కూడా పస్తుల పరిస్థితి ఉందన్నారు. ఇంటి బాడీగలు, కరెంట్ బిల్లులు, పిల్లలచదువు, ఆరోగ్య ఖర్చులు, కిరాణా అప్పులతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పనిభారం తగ్గించి 50 మంది విద్యార్థులకు ఒక ఆయాను నియమించాలి. ప్రమాద బీమా, చనిపోయిన కార్మిక కుటుంబాలకు ప్రభుత్వ సహాయం, యూనిఫామ్‌లు, గుర్తింపు కార్డులు కల్పించాలని కోరారు. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించి కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జనవరిలో ఫ్యాకల్టీ నియామకాలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో కొత్తగా ప్రవేశపెట్టిన కోర్సులను బోధించేందుకు అవసరమయ్యే ఫ్యాకల్టీ నియామకాలను జనవరిలో చేపడతామని రాయలసీమ విశ్వవిద్యాలయ రిజిస్ట్రర్ బి విజయకుమార్ నాయుడు పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొత్త కోర్సులలో చేరిన విద్యార్థులకు విద్యాబోధనకు ఇబ్బంది లేకుండా చూస్తున్నామన్నారు. కాంట్రాక్టు పద్ధతిలో ఫ్యాకల్టీని నియమించి అన్ని పాఠ్యాంశాలను విద్యార్థులకు బోధిస్తామని పేర్కొన్నారు.

డీలర్లపై కఠిన చర్యలు : ఎడిఎ

ప్రజాశక్తి-పత్తికొండ

ఫర్టిలైజర్ డీలర్లు రైతులకు ఎమ్మార్పీ ధరల కంటే అధికంగా అమ్మితేకఠిన చర్యలు తప్పవని ఎడిఎ మోహన్ విజయ్ కుమార్ హెచ్చరించారు. సోమవారం పత్తికొండ పట్టణంలో పత్తికొండ ఎఒ వెంకట రాముడు ఆధ్వర్యంలో పలు రకాల ఫర్టిలైజర్ షాపులను పత్తికొండ ఎడిఎ ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి మాట్లాడారు. రైతు కొనుగోలు చేసిన ప్రతి ఒక్కరికి రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని అన్నారు. నకిలీ ఎరువులు పిచికారి మందులు అమ్మినట్లు తెలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. షాపుల ముందు స్టాక్ పాయింట్ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు.

డయల్ యువర్ ఎస్ఇకి 8 ఫోన్ కాల్స్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు విద్యుత్ భవన్‌లో ఎస్ఇ కార్యాలయంలో నిర్వహించిన డయల్ ఎస్ఇ కార్యక్రమానికి 8 ఫోన్ కాల్స్ వచ్చాయని ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ ఆర్ .ప్రదీప్ కుమార్ తెలిపారు. అందులో బిల్లింగ్ కు సంబంధించి ఒకటి, విద్యుత్ స్తంభాలకు సంబంధించి ఐదు, ఇతరములు రెండు ఫోన్‌కాల్స్ మొత్తం ఎనిమిది ఫోన్ కాల్స్ వచ్చాయని చిన్న చిన్న సమస్యలను వెంటనే సంబంధిత అధికారులకు తెలిపి పరిష్కరిస్తామన్నారు. ఆర్థికపరమైన విషయాల సంబంధించిన వాటిని నియమ నిబంధనలను అనుసరించి పరిష్కరిస్తామన్నారు.

'మెడికవర్' 2026 క్యాలెండర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు డికవర్ హాస్పిటల్స్, కర్నూలు వారు రూపొందించిన 2026 సంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్లను ఎమ్మిగనూరు సర్కిల్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎన్. భార్గవి ఘనంగా ఆవిష్కరించారు. డిఎస్‌పి ఎన్. భార్గవి మాట్లాడుతూ, ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కలిగించే విధంగా రూపొందించిన ఈ క్యాలెండర్లు సమాజానికి ఉపయోగపడతాయని తెలిపారు. మెడికవర్ హాస్పిటల్స్ ప్రజారోగ్యానికి అందిస్తున్న సేవలు అభినందనీయమని ఆమె ప్రశంసించారు. మెడికవర్ హాస్పిటల్స్ క్లస్టర్ హెడ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ,ప్రజల ఆరోగ్యాన్ని కేంద్రంగా చేసుకుని మెడికవర్ హాస్పిటల్స్ ఎన్నో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 2026 క్యాలెండర్లు ప్రజలకు ప్రతిరోజూ ఆరోగ్యాన్ని గుర్తు చేసేలా రూపొందించామన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సామాజిక బాధ్యత కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.

మెడికవర్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డిఎస్‌పి ఎన్.భార్గవి , తదితరులు

రాఘవేంద్రుని సన్నిదిలో ఎపిఎస్‌ఆర్‌టిసి ఎండి ద్వారకా తిరుమల రావు

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం : కలెక్టర్

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుండి మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గృహ నిర్మాణాలపై సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్, పెన్షన్లు, హౌసింగ్, యూరియా సమీక్షలో ఆదోని, గోనెగండ్ల తహసీల్దార్‌ల వద్ద పెండింగ్ అర్జీలు ఎక్కువగా ఉన్నాయన్నారు. వెంటనే నోటీసులు ఇచ్చి పరిష్కరించాలని ఆదేశించారు. హౌసింగ్ కాలనీల్లో తాగునీరు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు.

కోల్స్‌చర్చ్ క్రిస్మస్ షటిల్ బ్యాడ్ మెంటన్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని కోల్స్ చర్చ్ ఆధ్వర్యంలో స్థానిక ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న షటిల్ బ్యాడ్ మెంటన్ పోటీలను చర్చి అధ్యక్ష కార్యదర్శులు సొలోమోన్, అనిల్ నాథ్, క్రీడల కన్వీనర్ విజయకుమార్, పాల్‌సుధాకర్ ప్రారంభించారు. గెలుపు ఓటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తితో పాల్గొని పోటీలను విజయవంతం చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో చర్చి పాస్టరు రెవ.ఆర్.అనిల్ సామ్యూల్, రెవ. జీవన్ రావు, క్రిస్మస్ కమిటీ నిర్వాహక చైర్మన్ సుధీర్ కుమార్, రెఫరీలుగా విన్సెంట్ గాంధీ, భీముడు, చిన్న, నరేష్, వ్యవహరించారు. బాల బాలికల స్త్రీ పురుషులకు సింగిల్సు డబల్సు లలో పోటీలను నిర్వహించారు. విజేతలకు కొత్త సంవత్సరం రోజు సాయంత్రం బహుమతులు ఇవ్వబడతాయని నిర్వాహకులు తెలిపారు.

బాల పురస్కార అవార్డు గ్రహీత శివానికి పెన్షన్‌కోసం వినతి

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

కర్నూలు జిల్లా మద్దికెరకు చెందిన పారా అథ్లెట్, జాతీయ బాల పురస్కార్ అవార్డు గ్రహిత శివాని పెన్షన్ మంజూరు చేయాలని సోమవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరికి వినతి పత్రాన్ని అందజేశారు. బాలవార్డు గ్రహీత శివాని తనకు రావాల్సిన పెన్షన్‌ను మంజూరు చేసి తన అకౌంట్ లో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. తన స్వగ్రామం మద్దికేరలో స్టేడియం లేదని, మినీ స్టేడియం నిర్మించాలని కలెక్టర్‌ను కోరింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి బాల పురస్కార్ అవార్డు గ్రహిత శివానిని శాలువాతో సన్మానించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శివానికి పెన్షన్ జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలిని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. స్టేడియం నిర్మాణానికి చర్యలు చేపడుతామని కలెక్టర్ తెలిపారు. శివానిని ఆదర్శంగా తీసుకొని బాలికలు ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు.

10న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

- వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి నబీరసూల్

ప్రజాశక్తి- దేవనకొండ

ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి కొత్త చట్టం 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవికా మిషన్ గ్రామీణ్' బిల్లును తీసుకొచ్చి పేదల కడుపులు కాల్చే కుట్రలకు కేంద్ర ప్రభుత్వం పాల్పడుతోందని వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నబీరసూల్, జిల్లా ఉపాధ్యక్షులు కె.మద్దిలేటి శెట్టి హెచ్చరించారు. సోమవారం దేవనకొండ సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలకు మెరుగైన పరిస్థితులు ఉన్నాయని.. 20 ఏళ్ల క్రితం ఉన్న పరిస్థితులు ప్రస్తుతం లేవని బిజెపి ప్రభుత్వం చెప్పడం దుర్మార్గమని మండిపడ్డారు. ఉపాధి హామీ చట్టాన్ని రక్షించాలని, జి రామ్ జి చట్టాన్ని రద్దు చేయాలని, 200 పని దినాలు కల్పించి, రోజు కూలి రూ.800 ఇవ్వాలని జనవరి 10వ తేదీన వ్యకాస ఆధ్వర్యంలో కర్నూలులోని జడ్‌పి హాలులో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిపిఐ, వ్యకాస నాయకులు ఎమ్.నరసరావు, కండప్ప, కృష్ణ, అనుమప్ప పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఘనంగా ఖాజా స్వామి ఉరుసు

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని ఏరూరు గ్రామంలో ఖాజా స్వామి 55వ ఉరుసు మహోత్సవం సోమవారం గ్రామ పెద్దలు, ప్రజల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి ప్రతిమను అశ్వంపై ప్రతిష్టించి గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. భక్తులు, మహిళలు, ప్రజలు నిండు బిందెలతో స్వామివారి పాదాలపై నీరు పోసి కొబ్బరికాయ, చక్కెరతో చదివింపులు నిర్వహించారు. ఊరేగింపునకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హాజరయ్యారు. ఊరేగింపు సజావుగా జరిగేందుకు ఎస్ఐ సతీష్ కుమార్, పోలీసు షబ్బీర్ తగిన జాగ్రత్తలు తీసుకున్నారు.

ప్రతిమను ఊరేగిస్తున్న గ్రామస్తులు

శ్రీమఠంలో హుండీ లెక్కింపు పూర్తి

- మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్ర స్వామి మఠంలో హుండీ లెక్కింపు ప్రక్రియ పూర్తయినట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. రాఘవేంద్రస్వామి దర్శనార్థమై దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు కానుకల రూపంలో హుండీలో వేసిన ఆదాయాన్ని లెక్కించినట్లు తెలిపారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ జిల్లా అధికారులు, శ్రీమఠం మేనేజర్ వెంకటేష్ జ్యోషి, ఇతర అధికారుల సమక్షంలో సేవాదారులతో కలిసి లెక్కింపు ప్రక్రియ చేపట్టామని పేర్కొన్నారు. డిసెంబర్ నెల 20 రోజుల హుండీ ఆదాయం నగదు రూపంలో రూ.3,73,66,587 రాగా, బంగారం 87 గ్రాములు, వెండి 910 గ్రాములు వచ్చినట్లు తెలిపారు.

నేషనల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఆదోని

గత 16, 17, 18వ తేదీల్లో నెల్లూరు జిల్లా బుజ్జిరెడ్డి పాలెంలో ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 వాలీబాల్ పోటీల్లో నేషనల్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. క్రీడల్లో గెలుపొందిన విద్యార్థికి సోమవారం నేషనల్ స్కూల్‌లో కరస్పాండెంట్ గోపాల్ రెడ్డి బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 9వ తరగతి విద్యార్థిని రితిక కర్నూలు జట్టు తరపున ప్రాతినిధ్యం వహించినట్లు తెలిపారు. ఈ విజయానికి కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులు రవి, గోవింద రాజును ప్రత్యేకంగా అభినందించారు. అధ్యాపకులు విజయ్ కుమార్ పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న గోపాల్ రెడ్డి

బేతంచెర్లలో చేపట్టిన ప్రచార జాతాలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

రెవెన్యూ క్లినిక్స్‌తో సత్వర న్యాయం

- ఏడు రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 373 దరఖాస్తుల స్వీకరణ : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో రెవెన్యూ సంబంధిత సమస్యలకు వేగవంతమైన పరిష్కారం అందించాలనే లక్ష్యంతో రెవెన్యూ యంత్రాంగం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణంలో ఏర్పాటు చేసిన ఏడు రెవెన్యూ క్లినిక్స్ ద్వారా ప్రజల నుండి మొత్తం 373 దరఖాస్తులను స్వీకరించామని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణంలో నిర్వహించిన రెవెన్యూ క్లినిక్స్‌కు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో హాజరై రెవెన్యూ సమస్యలపై అర్జీలు సమర్పించారు. జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్ఒ రాము నాయక్, రెవిన్యూ డివిజనల్ అధికారులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, అన్ని మండలాల తహశీల్దారులు పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి దరఖాస్తును సంబంధిత రెవెన్యూ డెస్కులలో నమోదు చేసి, త్వరితగతిన పరిష్కరించేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. రెవెన్యూ శాఖ అందిస్తున్న సేవల పట్ల ప్రజల్లో ఉన్న నమ్మకం మరింత పెంచి, సంతృప్తి స్థాయిని మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ వినూత్న కార్యక్రమాన్ని అమలులోకి తీసుకువచ్చిందన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి రెవెన్యూ క్లినిక్స్‌ను నిర్వహించి ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్

జిల్లాలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలను సంబంధిత శాఖల అధికారులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సూచించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించకపోతే, ఆ నిధులు వెనక్కి వెళ్లే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల ప్రతి శాఖ తమకు కేటాయించిన నిధులను సమర్థవంతంగా వినియోగించి అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి పథకానికి సంబంధించి మంజూరైన మొత్తం నిధులు, ఇప్పటివరకు ఖర్చు చేసిన మొత్తం, పథకం అమలవుతున్న ప్రాంతాలు, మిగిలి ఉన్న నిధులు, జరుగుతున్న అభివృద్ధి పనులు, పనులు పూర్తయ్యే గడువు వంటి వివరాలతో మంగళవారం ఉదయంలోగా క్లుప్తంగా నివేదికలను తమకు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

రెవెన్యూ క్లినిక్‌లు పరిశీలిస్తున్న కలెక్టర్, జెసి

ప్రచార జాతాలు విజయవంతం

- కార్మిక హక్కుల కోసం భవిష్యత్తులో ఉధృత పోరాటాలు : సిఐటియు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

విశాఖపట్నంలో ఈ నెల 31 నుండి జనవరి 4వ తేదీ వరకు జరిగే సిఐటియు అఖిల భారత 18వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ నంద్యాల జిల్లాలో ఈ నెల 27వ తేదీ నుండి మూడు బృందాలుగా చేపట్టిన ప్రచార జీపు జాతాలు సోమవారం ముగిశాయి. వెలుగోడులో ప్రారంభమైన మొదటి ప్రచార జాతా ఆత్మకూరు, కొత్తపల్లి, నందికొట్కూరు, పాములపాడు, పగిడ్యాల, మిడ్తూరు, గడివేముల మండలాల్లో సాగింది. నంద్యాల జిల్లా కేంద్రంలో ప్రారంభమైన రెండో ప్రచార జాతా నంద్యాల పట్టణంతోపాటు బండి ఆత్మకూరు, ఆళ్లగడ్డ, సిరివెళ్ల, రుద్రవరం, కోవెలకుంట్ల, సంజామల, దొర్నిపాడు, పట్టణ కేంద్రాలలో రెండు రోజులపాటు కొనసాగింది. డోన్‌లో ప్రారంభమైన మూడవ ప్రచార జాతా డోన్, ప్యాపిలి, బనగానపల్లె, అవుకు, బేతంచెర్ల తదితర మండలాల్లో కొనసాగి సోమవారం ముగిసింది. చివరి రోజు జరిగిన ప్రచార జాతాలో సిఐటియు నాయకులు ఎల్లయ్య, సహాయ కార్యదర్శి శివరాం, రామాంజనేయులు, నాగ మద్దయ్య తదితరులు మాట్లాడారు. కార్మిక హక్కుల సాధన కోసం భవిష్యత్తులో పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల ద్వారా కార్మికులకు వేతన హక్కు, సమ్మె చేసే హక్కు లేకుండా పోతుందన్నారు. యాజమాన్యాలకు బానిసలుగా పని చేయాలని దుర్మార్గమైన విధానాలను రూపొందించిందని అన్నారు. కార్మికులు రోబోలుగా నిరంతరం పని చేయాల్సిందేననే పద్ధతిలో 13 గంటల పని విధానం తీసుకురావడం దుర్మార్గమన్నారు. వీటికి వ్యతిరేకంగా భవిష్యత్తులో దేశవ్యాప్తంగా కార్మిక వర్గాన్ని ఐక్యం చేయడం కోసం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని జిరాంజీ పేరుతో మార్పు చేసి కేంద్ర ప్రభుత్వం 60 శాతం మాత్రమే నిధులు కేటాయిస్తూ, మిగిలిన 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వాలు భరించాల్సిందేనని చెప్పడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. నేడు ఈ చట్టం ద్వారా రూ.4 వేల కోట్లు రాష్ట్రాలపై భారం పడనుందని, అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా ఈ చట్టాన్ని నిర్వహించలేకపోతే కేంద్ర ప్రభుత్వం పూర్తిగా ఎత్తివేస్తుందన్నారు. ఫలితంగా వ్యవసాయ కార్మికులు తీవ్రంగా నష్టపోతారన్నారు. వ్యవసాయ కూలీల కడుపులు కొట్టే కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వ్యవసాయ కార్మికులను కలుపుకొని ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. రాబోయే కాలంలో చేయాల్సిన పోరాటాలకు దిశా నిర్దేశం చేసుకునేందుకు జాతీయ మహాసభలలో తీర్మానం చేయనున్నట్లు తెలిపారు.

కర్షకులకు కలిసిరాని '2025'

ధర లేక పొలంలోనే వదిలేసిన ఉల్లి పంటను తింటున్న గొర్రెలు (ఫైల్ ఫోటో)

దేశానికి పట్టెడన్నం పెట్టే రైతన్నలకు ఈ ఏడాది 2025 కాలం కలిసి రాలేదు. ఖరీఫ్, రబీ రెండు సీజన్లలోనూ కష్టాల కడలిలో ఎదురీదారు. ఆరుగాలం పడిన రెక్కల కష్టం ప్రకృతి కన్నెర్రతో పంటలన్నీ వర్షార్పణం అయ్యాయి. పెట్టుబడులు రాక భారీగా నష్టపోవాల్సి వచ్చింది. ఖరీఫ్ సీజన్లో అకాల వర్షాలు రైతులను నిండా ముంచేశాయి. పంటలకు గిట్టుబాట ధరలు కూడా లేకపోవడంతో మరింత నష్టపోవాల్సి వచ్చింది. మొత్తంగా ఈ ఏడాది రైతులకు సరిగా కలిసి రాలేదు.

- పంటలు చేతికొచ్చిన దశలో తుఫాన్ల దెబ్బ
- వరి, మొక్కజొన్న పంటలకు తీవ్రం నష్టం
- ధర లేక పొలాల్లోనే వదిలేసిన ఉల్లి, అరటి
- కనీస పెట్టుబడులు కూడా రాని వైనం

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి మండలంలో సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో కురిసిన ఎడతెరిపి లేని వర్షాల కారణంగా మొక్కజొన్న, వరి, మినుము తదితర పంటలకు నష్టం వాటిల్లింది. మొంథా తుపాను వల్ల కురిసిన వర్షాలకు వరి పంట నేలకొరిగింది. చిరుపొట్ట దశలో ఉన్న పంటంతా దెబ్బతిని తాలు గింజలు ఏర్పడ్డాయి. వరి దిగుబడి బాగా తగ్గిపోయింది. వరితోపాటు వేరుశనగ, మినుము, కంది, మొక్కజొన్న, ఉల్లిపంటలు దెబ్బతిన్నాయి. తుఫాను కారణంగా కురిసిన వరుస వర్షాలతో చాగలమర్రి మండలంలో సుమారు 1378 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. పంట నష్టానికి సంబంధించి కూటమి ప్రభుత్వం ఇప్పటికీ ఒక్క రుపాయి కూడా నష్టపరిహారం విదల్చలేదు. ఆ తర్వాత కురిసిన అధిక వర్షాల వల్ల కూడా వంటలు దెబ్బతిన్నాయి. పెట్టుబడులు కూడా రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా ఈ ఏడాది రైతులకు కలిసి రాలేదు.

ఉల్లి పంట ఊడ్చుకుపోయింది..

చాగలమర్రి మండలంలో ఉల్లి రైతుల పరిస్థితి దయనీయం. పంట చేతికొచ్చే సమయంలో కురిసిన వర్షాలకు తీవ్రంగా నష్టపోయారు. చాలా మంది రైతులకు ఉల్లి పంట సాగు ఖర్చులు కూడా రాలేదు. దీనికి తోడు క్వింటాకు రూ.1200 మద్దతు ధర ప్రకటించిన ప్రభుత్వం కొనుగోళ్లు వారం రోజులకే పరిమితం చేసింది. ఆ తర్వాత హెక్టారుకు రూ. 50 వేలు పరిహారం ఇస్తామని చెప్పినా అమలు శూన్యం. చివరకు ఉల్లి పంట ధర క్వింటా రూ.40 నుంచి రూ.200కు పడిపోయింది. దీంతో రైతులు పంటను పొలంలోనే వదిలేశారు. ఈ ఏడాది ఉల్లి రైతులు పూర్తిగా నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకుపోయారు.

యూరియా కోసం పాట్లు..

ఖరీఫ్ సీజన్‌లో యూరియా కోసం రైతులు పడరాని పాట్లు పడ్డారు. గతంలో ఎన్నడూ లేని విధంగా షాపులు, రైతు సేవా కేంద్రాలు, సొసైటీల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది. అయినా ఒక్కో రైతుకు ఒక బస్తా మాత్రమే ఇచ్చారు. అది సరిపోక బ్లాకులో కొందామంటే కూడా దొరకక చాలా ఇబ్బందులు పడ్డారు.

చాగలమర్రిలో నేలకొరిగిన వరి పంట (ఫైల్ ఫోటో)

అధిక వర్షాలకు నీట మునిగి దెబ్బతిన్న మినుము పంట (ఫైల్ ఫోటో)

వివరాలు వెల్లడిస్తున్న సిఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి

2.1 కేజీల గంజాయి స్వాధీనం

- నలుగురు అరెస్టు - 4 సెల్ ఫోన్లు స్వాధీనం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

గంజాయిని రవాణా చేస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుండి 2 కిలోల 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సిఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని పోలీస్ కార్యాలయంలో గంజాయి వివరాలను ఆయన సోమవారం మీడియాకు వెల్లడించారు. ఆత్మకూరు పట్టణానికి చెందిన కావేటి నాగ శేషాద్రి, నందికొట్కూరు పట్టణానికి చెందిన షేక్ మసూద్, కుమ్మరి హరినాథ్, అనంత చిన్మయ నంద గౌడ్‌లను అరెస్టు చేసినట్లు వివరాలు వెల్లడించారు. వారి వద్ద నుండి నాలుగు సెల్ ఫోన్లు, రూ. 3వేల నగదును సీజ్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. వీరు నందికొట్కూరు పట్టణంలోని ఆత్మకూరు రోడ్డు చాటలమ్మ పోరకలమ్మ గుడి సమీపంలో వీరు గంజాయి రవాణా చేస్తుండగా ఎస్ఐ చంద్రశేఖర్ తమ పోలీసు సిబ్బంది సమాచారం మేరకు వారి వద్ద నుండి గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు సిఐ పేర్కొన్నారు. సమావేశంలో ఎఎస్ఐ రామచంద్ర, హెడ్ కానిస్టేబుల్ నరేంద్ర, కానిస్టేబుల్ బాలకృష్ణ, చెన్న రాయుడు, చిన్న మధు, హోంగార్డు సతీష్, గోపాల్ టీంగా ఏర్పడి ముద్దాయిలను అరెస్టు చేసినట్లు సిఐ వెల్లడించారు.

మాట్లాడుతున్న దృశ్యం

సబ్ జైలును తనిఖీ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : పట్టణంలోని సబ్ జైలును జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి లీల వెంకట శేషాద్రి, జూనియర్ సివిల్ జడ్జి భాస్కర్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిమాండ్ ఖైదీలతో జైలులో ఎన్ని రోజులుగా శిక్ష అనుభవిస్తున్నారు, న్యాయవాదులను ఏర్పాటు చేసుకున్నారా లేదా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే జైలులో అందిస్తున్న సేవలు, సౌకర్యాలు, భోజన వసతి, వైద్య సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదిని నియమించుకోలేని వారికి ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. జైలు జీవితం అనంతరం సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ జైలు ఇంచార్జ్ సూపరింటెండెంట్ బాబు, ప్యానల్ న్యాయవాది మోహన్, డాక్టర్ లిఖిత్ రెడ్డి, జైలు సిబ్బంది, కోర్టు పాల్గొన్నారు.

వికలాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించాలి

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్ : వికలాంగులకు ప్రతి నెలా 3వ శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించాలని డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు డిపి మస్తాన్ వలి కోరారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆయన కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగుల కోసం ప్రతి నెలా మూడవ శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ 'స్వాభిమాన్' కార్యక్రమం నిర్వహించాలని, అలాగే వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి వారి జీవితాలలో వెలుగులు నింపాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కిరణ్ కుమార్, శ్రీనివాసులు, దివాకర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, అక్బర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

తీర్మానానికి విరుద్ధంగా మట్టి తవ్వకాలు

- సర్పంచి పెద్ది రమణయ్య

ప్రజాశక్తి - శిరివెళ్ల : తీర్మానానికి విరుద్ధంగా మహాదేవపురం గ్రామంలో మట్టి తవ్వకాలు జరుపుతున్నారని ఆ గ్రామ పంచాయతీ సర్పంచ్ పెద్ది రమణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్యదర్శితో కలిసి తాను రహదారి అభివృద్ధి కోసం తీర్మాణం చేసినట్టు తెలిపారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు రాత్రుళ్ళు వచ్చి జెసిబిలతో విలువైన మట్టిని తోడేస్తూ పూర్వం నుండి ఉన్న రహదారిని ధ్వంసం చేస్తున్నారని అన్నారు. పోలీస్, మైనింగ్, రెవెన్యూ పంచాయతీరాజ్ తదితర ప్రభుత్వ శాఖల అధికారులు తక్షణమే స్పందించి పూర్వం నుండి ఉన్న పోలేరమ్మ రస్తాను కాపాడాలని, మట్టి వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మాట్లాడుతున్న సర్పంచి

నంద్యాల విజయ పాల డైరీ డైరెక్టర్లు హౌస్ అరెస్ట్

- డైరెక్టర్లను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యేలు కాటసాని, గంగుల

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల విజయ పాల డైరీ డైరెక్టర్లను పోలీసులు సోమవారం హౌస్ అరెస్ట్ చేశారు. గత నెలలో ముత్యాలపాడు సొసైటీ డైరెక్టర్‌గా భూమా విఖ్యాత్ రెడ్డిని 6 మంది సొసైటీ అధ్యక్షులు ఎన్నుకున్నారు. అయితే ఈ ఎన్నిక చెల్లదని ఈ నెల 11న విజయ డైరీ వివాదాల పరిష్కార కమిటీ ముత్యాలపాడు సొసైటీకి నోటీసు జారీ చేసింది. ముత్యాలపాడు గ్రామంలో జరిగిన సొసైటీ ఎన్నికపై ఆరుగురు సొసైటీ అధ్యక్షులు ఈ నెల 19న వివరణ ఇవ్వాలంటూ డైరీ యాజమాన్యం కోరింది. ఈ నెల 19న వివరణకు భూమా విఖ్యాత్ రెడ్డి హాజరయ్యారు. అయితే విజయ పాల డైరీలో చైర్మన్, విచారణ అధికారులు లేకపోవడంతో వేచి చూసి భూమా జగత్ విఖ్యత్ రెడ్డి వెళ్లిపోయారు. అయితే మళ్లీ సోమవారం హాజరు కావాలని వివాదాల పరిష్కార కమిటీ నోటీసు ఇచ్చింది. దీంతో వివరణ ఇచ్చేందుకు జగత్ విఖ్యాత్ రెడ్డి హాజరు కానుండటం, అదేరోజు పాలక మండలి సమావేశం ఉండటంతో ఎలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తుగా విజయ పాల డైరీ డైరెక్టర్లను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. హౌస్ అరెస్ట్ అయిన వారిలో విజయసింహ రెడ్డి, పీపీ మధుసూదన్ రెడ్డి, రవికాంత్ రెడ్డి ఉన్నారు. అలాగే పాల డైరీ వద్ద భారి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. వివరణకు అనుమతి తిరిగి జనవరి 3కు వివాదాల పరిష్కార కమిటీ వాయిదా వేసింది. హౌస్ అరెస్టు అయిన పాలడైరీ డైరెక్టర్లను వైసిపి పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల నానిలు పరామర్శించారు. కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ పోలీసులను అడ్డం పెట్టుకొని విజయ పాల డైరీ డైరెక్టర్లను హౌస్ అరెస్టులు చేయించడం సరైంది కాదన్నారు. ఎల్లకాలం ఈ ప్రభుత్వమే ఉండదని, వచ్చేది వైసీపీ అన్నారు. అప్పుడు మీరు పాలక వర్గంగా ఉన్నా తాము కొనసాగనివ్వబోమని అన్నారు. పోలీసులను అడ్డం పెట్టుకొని అపాలనుకుంటే భయపడమని, చట్టపరంగా వస్తే సహకరిస్తామని డైరెక్టర్ పీపీ మధుసూదన్ రెడ్డి అన్నారు. కాదు కూడదని నిబంధనలకు విరుద్ధంగా వస్తామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. విజయ డైరీలో డిస్ప్యూట్ రెజల్యూషన్ కమిటీ జరగకుండా కుట్ర చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

విజయపాల డైరీ డైరెక్టర్లను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

'గ్రీట్ విత్ గ్రీన్' పోస్టర్లు విడుదల

ప్రజాశక్తి, నంద్యాల కలెక్టరేట్

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రూపొందించిన 'గ్రీట్ విత్ గ్రీన్' పోస్టర్లను జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలను బొకేలు, కేకులు వంటి సంప్రదాయ పద్ధతులకు బదులుగా మొక్కలు నాటి, విద్యాసామగ్రి అందజేసే విధంగా జరుపుకోవాలని జిల్లా అధికారులకు పిలుపునిచ్చారు. ఇటువంటి కార్యక్రమాలు పర్యావరణ పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యతను కూడా పెంపొందిస్తాయని తెలిపారు. జూనియర్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ అధికారుల నుండి సేకరించిన మొక్కలను ప్రభుత్వ విద్యా సంస్థల్లో నాటడం, అలాగే సేకరించిన విద్యాసామగ్రిని వసతి గృహాలలోని విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల, సెక్రటరీ, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీకాంత్ రెడ్డి, కోశాధికారి నాగేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్మాన్ భాష, అటవీ శాఖ అధికారి (డీఎఫ్ఓ) అబ్దుల్ సమీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

పురాతన శిలాశాసనాన్ని స్వాధీనం చేసుకోవాలి

- మాజీ సర్పంచి బిసి రాజారెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

శాలివాహన శకం 1522 సంవత్సరానికి చెందిన పురాతన శిలాశాసనాన్ని పురావస్తు శాఖ అధికారులు స్వాధీనం చేసుకోవాలని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచి బిసి రాజారెడ్డి కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తాను బనగానపల్లె పట్టణ సర్పంచ్‌గా పనిచేసిన సమయంలో ఈ పురాతన శిలా శాసనాన్ని సేకరించి గ్రామపంచాయతీ ఆఫీస్ పక్కన ఏర్పాటు చేసిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పార్క్‌లో ప్రతిష్టించి దానిని తెలుగులో అనువదించినట్లు చెప్పారు. ఈ శాసనాన్ని పురావస్తు శాఖ అధికారులు స్వాధీనం చేసుకొని మ్యూజియంలో ఏర్పాటు చేయాలని రెండుసార్లు ఉత్తరం ద్వారా వారికి సమాచారం అందించిన ఎటువంటి స్పందన లేదన్నారు. ఇప్పటికైనా వారు స్పందించి ఈ పురాతన శిలాశాసనాన్ని స్వాధీనం చేసుకొని భద్రపరచాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. క్రీస్తు శకం 1600 సంవత్సరం పెనుగొండ సింహాసనాధిపతులు వెంకటపతి దేవ మహారాయుల సామంతులు అవుకు సంస్థానాధిపతులు తిమ్మరాజయ్య పుత్రుడు బావరాజు బనగానపల్లె చెన్నకేశవ పెరుమాళ్ళకు సమర్పించిన భూ శాసన క్రమం బనగానపల్లె పరిధిలోని బత్తులూరుపాడు గ్రామం చతుర్దిశలకు లోనైన 13 పుట్ల ముత్తుం చేను అష్ట భోగములకు (ఆలయ ధూప దీప నైవేద్యాలకు) ఇచ్చారని, దీనికి ఆధారమైన ప్రాచీన శిలా శాసనంలోని అక్షరాలు తులు భాషగా తెలియజేస్తుందన్నారు. యనకండ్ల గ్రామం గత కొన్ని వందల సంవత్సరాల కిందట వెంనకండ్లగా పిలిచేవారని, కాలక్రమంలో యనకండ్ల అంటున్నారన్నారు. ఇప్పటికైనా పురావస్తు శాఖ వారు స్పందించి పురాతన శిలాశాసనాలను భద్రపరచాలని కోరారు.

మాట్లాడుతున్న బిసి రాజారెడ్డి

పురాతన శిలా శాసనం

ఎంబ్రాయిడింగ్ షాపును ప్రారంభిస్తున్న దృశ్యం

యువత స్వయం ఉపాధి వైపు సాగాలి

- ఆళ్లగడ్డ 5వ జిల్లా కోర్టు ఎపిపి బత్తిని శివప్రసాద రావు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

చదువుకున్న యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి వైపు వెళుతుండటం మంచి శుభ పరిణామమని ఆళ్లగడ్డ 5వ జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బత్తిని శివప్రసాదరావు పేర్కొన్నారు. సోమవారం ఆళ్లగడ్డ పట్టణంలో పోలీస్ లైన్ వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీసాయి భవాని ఎంబ్రాయిడింగ్, మగ్గం వర్క్ షాప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకున్న యువత సొసైటీలో చాలామంది ఉన్నారని ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి వైపు వెళ్లడం మంచిదన్నారు. కార్యక్రమంలో సాయి భవాని ఎంబ్రాయిడింగ్, మగ్గం వర్క్ షాప్ యజమానురాలు సాయి భవాని సుదర్శన్, ఆళ్లగడ్డ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సీనియర్ న్యాయవాది రమణయ్య, న్యాయవాదులు మురళీధర్ గౌడ్, తిరుపాలు రెడ్డి, శ్రీనివాసులు, సుబ్బయ్య, లత, సుదర్శన్, లక్ష్మి నరహరి, వెంకట ప్రసాద్, రఘురాం రెడ్డి, వెంకటేశ్వర్లు, గణేష్, రాజేష్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - అవుకు : ప్రకృతి వ్యవసాయం ద్వారా కలిగే ప్రయోజనాలు రైతులకు వివరించాలని మండల వ్యవసాయ అధికారి కలిమున్నిసా తెలిపారు. ప్రకృతి వ్యవసాయంపై సమన్వయ సమావేశాన్ని వెలుగు కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి వ్యవసాయ అధికారి కలిమున్నిసా, ఎస్ఇఆర్‌పి అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ నాగరాజు, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు. మేనేజర్ నాగరాజు మాట్లాడుతూ మహిళా సంఘాలలోని ప్రతి మహిళా సభ్యురాలు ఇంటి వద్ద పెరటి తోటలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పొలం ఉన్న ప్రతి మహిళ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి మెరుగైన ఆదాయం పొందే దిశగా ముందుకు రావాలని సూచించారు. వచ్చే ఖరీఫ్ సీజన్లో ఈ యాక్షన్ ప్లాన్ అమలు చేసేందుకు ఈ సమన్వయ సమావేశం మూడు రోజులపాటు గ్రామస్థాయిలో జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మహిళా సంఘాలు అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారిని కలిమున్నీసా

బొకేలు వద్దు పుస్తకాలే ముద్దు : ఎమ్మెల్యే కోట్ల

ప్రజాశక్తి - ప్యాపిలి

నూతన సంవత్సరం రోజున కార్యకర్తలు దండలు, శాలువాలు, బొకేలు తీసుకురావద్దని, విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు తీసుకురావాలని ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. తనను కలిసేవారు వాటికి బదులు విద్యార్థులకు ఉపయోగపడే పెన్నులు, పుస్తకాలు, పండ్లు, మొక్కలు తీసుకురావాలని సూచించారు. అభిమానం ఆడంబరంగా కాకుండా సామాజిక సేవకు తోడ్పాటు అందించాలన్నారు.

కార్యకర్తలకు ప్రశంసాపత్రాలు అందజేత

ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే, మాండ్ర

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు నియోజకవర్గంలో బూత్ స్థాయిలో కష్టపడి పార్టీకి, ప్రజలకు సేవలందించిన కార్యకర్తలకు ఉత్తమ ప్రశంసా పత్రాలను ఎమ్మెల్యే గిత్త జయసూర్య, నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇన్‌ఛార్జ్ మాండ్ర శివానందరెడ్డిలు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, వెంకటేశ్వర్లు యాదవ్, ప్రసాద రెడ్డి, రమేష్ రెడ్డి, సత్యం రెడ్డి, సర్వోత్తమరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలు మృతి

మృతి చెందిన శాంతమ్మ టీచర్(ఫైల్)

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

కోవెలకుంట్ల పట్టణంలోని ప్రాథమిక పాఠశాల స్పెషల్ స్కూల్లో పని చేస్తున్న ఉపాధ్యాయురాలు శాంతమ్మ(50) సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు ఫిట్స్ రావడంతో మృతి చెందినట్లు ఆమె భర్త సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆమె మృతదేహానికి పలువురు ఉపాధ్యాయులు, వారి బంధువులు పూలమాలు వేసి నివాళులర్పించారు. మృతురాలికి ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్నారు.

యాసిడ్ తాగి వ్యక్తి ఆత్మహత్య

మృతి చెందిన తిప్పన్నగారి చిన్న మద్దిలేటి(ఫైల్)

ప్రజాశక్తి - మిడుతూరు

మిడుతూరు మండలంలోని కనుమూరు గ్రామానికి చెందిన తిప్పన్న గారి చిన్న మద్దిలేటి(48) అనే వ్యక్తి యాసిడ్ తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాలు.. కడుమూరు గ్రామంలో మద్దిలేటి అనే వ్యక్తి మానసిక ఆరోగ్యం బాగోలేక చనిపోవాలనే ఉద్దేశంతో ఈ నెల 24న రాత్రి మద్యం సేవించి మత్తు దిగిన తర్వాత తెల్లవారుజామున 2 గంటలకు ఇంటిలో ఉన్న బాత్రూం కడిగే యాసిడ్ తాగానని భార్య తిప్పన్న గారి లక్ష్మీదేవికి చెప్పాడు. ఈ విషయాన్ని మృతుని భార్య లక్ష్మీదేవి బావ పెద్ద మదిలేటికి చెప్పింది. చికిత్స కోసం 108లో తెల్లవారుజామున కర్నూలు జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. భార్య ఫిర్యాది మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎఎస్ఐ సుబ్బయ్య తెలిపారు.

మురుగునీరు తొలగించండి

సిసి రోడ్డుపై పారుతున్న మురుగునీరు

ప్రజాశక్తి - సంజామల

మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి దేవాలయం ఎదురుగా ఉన్న వీధిలో సీసీ పారుతున్న మురుగు నీటిని తొలగించాలని కాలనీవాసులు అధికారులను కోరుతున్నారు. రోడ్డుపై మురుగు నీరు పారడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, చిన్న పిల్లలు, వృద్ధులు రోడ్డుపై నడిచే క్రమంలో కాలు జారి కింద పడుతున్నారని వాపోతున్నారు. సైడు కాల్వలో పూడిక తీయకపోవడంతో మురుగునీరు రోడ్డుపై పారుతుందన్నారు. పిల్లలు పాఠశాలలకు వెళ్లాలన్నా ఇబ్బందులు తలెత్తుతున్నాయని కాలనీవాసులు తెలిపారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు విన్నవించినా.. తొలగిస్తాం అంటున్నారు కానీ ఇంతవరకు పూడిక తీయకపోవడం లేదని కాలనీ వాసులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని పూడిక తీసి సిసి రోడ్డుపై మురుగునీరు లేకుండా చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

సిఐటియు, సిపిఎం క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

సున్నిపెంట 2వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో సిఐటియు, సిపిఎం నూతన క్యాలెండర్లను సిఐ గంటా సుబ్బారావు సోమవారం ఆవిష్కరించారు. ముందుగా నాయకులు సిఐను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు మునిపాటి చిన్న మారెన్న, శ్రీశైలం మండలం సిఐటియు మండల అధ్యక్షులు దర్శనం నాగరాజు, సిఐటియు ట్రెజరర్ యోబు, సభ్యులు బొడ్డు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ముస్లిం మత పెద్ద మృతి



ముఫ్తి అబ్దుల్ వహాబ్ సాహెబ్(ఫైల్)

ప్రజాశక్తి - ఆత్మకూరు

నెల్లూరుకు చెందిన ముస్లిం మత పెద్ద ముఫ్తీ అబ్దుల్ వహాబ్ సాహెబ్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆత్మకూరు పట్టణంలోని మదరస మదీనా తుల్ (పెద్ద మదరస) కమిటీ సభ్యులు ఎంఎ రషీద్, ముర్తుజా మౌలానా, జాకీర్ సాహెబ్, ముస్తాఫా, ఎలిజాని కరీం, తదితరులు సోమవారం నెల్లూరు పట్టణానికి వెళ్లి ఆయనకు నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ముఫ్తీ అబ్దుల్ వహాబ్ సాహెబ్ ఆంధ్రప్రదేశ్‌తోపాటు ప్రపంచ వ్యాప్తంగా ఇస్లామిక్ సేవలో ఆయన విశేష సేవలు అందించారని కొనియాడారు. సమాజ సేవలోనూ జమాత్ మార్గంలోనూ అనేక మందిని ఆధ్యాత్మిక చింతనతో పని చేసేలా మార్చారన్నారు. ఆయన మృతి తీరని లోటన్నారు.

భూసార పరీక్ష ఫలితాలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - వెలుగోడు

భూసార పరీక్ష ఫలితాలపై మండలంలోని రైతులు సోదరులకు ఎడిఎ సరళమ్మ ఏఓలు వెంకటేశ్వర్ రెడ్డి, హేమసుందర్ రెడ్డి సమక్షంలో సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా నేల ఆరోగ్య నివేదిక మీ పొలం పోషక స్థాయిలు, సూక్ష్మపోషకాలు, పిహెచ్ స్థాయిలు, సేంద్రియ కార్బన్ వంటి వివరాలను వివరించారు. సరైన ఎరువుల సిఫార్సు, నేలలో ఉన్న లోపాలను బట్టి ఏ ఎరువు ఎంత మోతాదులో వాడాలి, ఎప్పుడు వాడాలి అనే దానిపై సలహాలు ఇచ్చారు. నేల ఆరోగ్యం మెరుగుపడటంతో పంటలు బాగా పెరిగి, అధిక దిగుబడి వస్తుందన్నారు. మెరుగైన పంట నాణ్యతతో మార్కెట్లో మంచి ధర లభిస్తుందన్నారు. పంట మార్పిడి, నేల సమతుల్యతను కాపాడటానికి తోడ్పడుతుందని వివరించారు.

'ఉపాధి' రక్షణ కోసం ఉద్యమిస్తాం : వ్యకాస

కమిటీ సభ్యులతో కలిసి అభివాదం చేస్తున్న వ్యకాస జిల్లా అధ్యక్షులు ఎం నాగేశ్వరరావు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకొనేందుకు పేదలు కష్టజీవులు శ్రామికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. జూపాడు బంగ్లా మండల వెంకటేశ్వర స్వామి దేవాలయ ఆవరణంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభను సోమవారం నిర్వహించారు. మండల కార్యదర్శి ఎం కర్ణ. అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు హాజరై మాట్లాడారు. పేదలు కష్ట జీవులు శ్రామికులు తిండి అయినా పెట్టాలి, పనైనా చూపాలి అని పెద్ద ఎత్తున పోరాడిన ఫలితంగా వామపక్షాల అండతో 2005లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పార్లమెంటులో మోదించి చట్టం చేసినట్లు గుర్తు చేశారు. ఆనాడు ఉన్న ధరలకు అనుకూలంగా రోజు వేతనం వంద రూపాయలు వంద రోజులు పని దినాలు కల్పించడం జరిగిందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మూడో సారి అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులకు నిధులు తగ్గిస్తూ ఆంక్షలు విధిస్తూ ఈ పనిని పేదలకు దూరం చేయడానికి కుట్ర పూరితంగా ఇప్పుడు పార్లమెంట్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని సవరిస్తూ గాంధీని చంపిన వ్యక్తి జిరామ్‌జి పేరు మార్పు చేసిందని తెలిపారు. రాష్ట్రాలపై పెత్తనం చెలాయిస్తూ కేంద్ర ప్రభుత్వం 90శాతం నిధులు ఇవ్వాల్సి ఉండగా 60 శాతం నిధులే ఇస్తామని ఆంక్షలు విధించడం పేదలకు ఉపాధి హామీ పనిని దూరం చేయడమే లక్ష్యంగా బిజెపి కుట్ర పూరితముగా వ్యవహరిస్తుందని విమర్శించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకోవడానికి మనమంతా ఐక్యంగా పోరాడుదామని పిలుపునిచ్చారు. ప్రతి జాబ్ కార్డు ఉన్న కుటుంబానికి 200 రోజులు పని దినాలు కల్పించి రోజు వేతనం రూ. 600 ఇవ్వాలని, పనుల దగ్గర వసతులు కల్పించి జాబు కార్డు లేని వారందరికీ జాబ్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలు జనవరి 9, 10 తేదీల్లో పాములపాడులో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వాటిని జయప్రదం చేయాలని కోరారు.

వ్యకాస మండల కమిటీ ఎన్నిక..

అధ్యక్షులుగా ఎం. రంగస్వామి ఉపాధ్యక్షులుగా కర్ణ, శ్రీనివాసులు, కార్యదర్శిగా గోపాల్ రావు, సహాయకార్యదర్శిగా వెంకటేశ్వర్లు, రంగన్నలతోపాటు 16 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఈ కమిటీ పేదల పక్షాన సమిష్టిగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శ్రీనివాసులు, సిఐటియు మండల కార్యదర్శి ఆకుల రాము, అమ్మన్న, పుల్లయ్య, దేవరాజు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

సదస్సులో మాట్లాడుతున్న ఏరియా కోఆర్డినేటర్ పుల్లయ్య

ప్రజాశక్తి - కొత్తపల్లి

ప్రకృతి వ్యవసాయంపై రైతు సోదరులు దృష్టి సారించేలా వ్యవసాయ శాఖ సిబ్బంది అవగాహన కల్పించాలని వెలుగు ప్రాజెక్టు ఏరియా కో-ఆర్డినేటర్ పుల్లయ్య పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా అమలు చేయాలనే లక్ష్యంతో కొత్తపల్లి మండలంలోని మహిళా మండల సమాఖ్య కార్యాలయంలో వ్యవసాయ శాఖ, వ్యవసాయ అనుబంధ శాఖలు, రైతు సాధికార సంస్థ, సెర్ప్, వెలుగు సంస్థల సమన్వయంతో మండల స్థాయి సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. వెలుగు ప్రాజెక్టు ఏరియా కో ఆర్డినేటర్ పుల్లయ్య మాట్లాడుతూ ప్రతి గ్రామ సంఘ సమావేశంలో ప్రకృతి వ్యవసాయ అంశాన్ని అజెండాగా తీసుకుని చర్చించాలని సూచించారు. చిన్న రైతులు, స్వయం సహాయక సంఘాల సభ్యులతో ప్రకృతి వ్యవసాయాన్ని అమలు చేయడమే కాకుండా ప్రతి ఇంట్లో పెరటి తోటల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ (NMNF)గా జాతీయ స్థాయిలో అమలు చేయడం సంతోషకరమని, ప్రతి ఒక్కరూ తప్పకుండా తమకు ఉన్న పొలంలో కనీసం 50 సెంట్లు అయినా ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ విభాగం అడిషనల్ డిపిఎం సలాం నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్‌పై అవగాహన కల్పించి, మండలంలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ విధానాలు, కొత్తగా ఎంపికైన గ్రామాల్లో చేపట్టనున్న కార్యక్రమాలను వివరించారు. అలాగే మండల సమాఖ్య స్థాయిలో ప్రకృతి వ్యవసాయ కమిటీగా ముగ్గురు సభ్యులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎఒ అమీ రున్నీసా బేగం మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం-రసాయనిక వ్యవసాయం మధ్య ఉన్న తేడాలను వివరించారు. యూరియా, డీఏపీ వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు అడుగులు వేయాలని సూచించారు. ప్రతి రైతు తప్పకుండా విత్తన శుద్ధి చేసుకోవాలని, పంటల మార్పిడి ఉండాలని ఒకే పంట ప్రతిసారీ వేస్తే దిగుబడి తగ్గుతుందని రైతులు వినూత్న పంటల సాగు అలవాటు చేసుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం ఎస్ఆర్‌పి నరేంద్ర గౌడ్ మాట్లాడుతూ ఒకే పంట సాగు చేయటంతో కలిగే నష్టాలు, పలు పంటల సాగు వల్ల కలిగే లాభాలు వివరించారు. మోడల్ మేకర్ సయ్యద్ బాషా, మహబూబ్‌బాష ఎన్ఎంఎన్ఎఫ్ ద్వారా గ్రామంలో జరుగుతున్న, చేపట్టబోయే కార్యక్రమాలు, కిచెన్ గార్డెన్ సాగు గురించి వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ డిపిఎం అబ్దుల్ సలాం, ఫార్మర్ మాస్టర్ ట్రైనర్లు సరస్వతి, రాజు నాయక్, చిన్న స్వామి నాయక్, ఏఈఓ నాగశ్రీ, ఎంపీవోలు, వెలుగు సీసీలు, వివోఏలు, ఐసీఆర్పీలు, మండల సమాఖ్య మహిళా సభ్యులు, ప్రకృతి వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నివారణకు కృషి

- కమిషనర్ హరిప్రసాద్, చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి

జూట్ బ్యాగులు పంపిణీ చేస్తున్న కమిషనర్, చైర్మన్

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్ల నగర పంచాయతీ పరిధిలో ప్లాస్టిక్ వాడకాల్ని పూర్తిగా నివారించేందుకు, వాతావరణ కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్, ఛైర్మన్ సిహెచ్ చలం రెడ్డిలు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్ల సర్వసభ్య సమావేశాన్ని చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ మధు తేజ అజెండాను చదివి కౌన్సిలర్ల ముందు ప్రవేశపెట్టారు. అనంతరం కౌన్సిలర్లు ముబీనా, కోట్ల మధు, నంద్యాల కుమారి, విజయలక్ష్మి, ఇబ్రహీం, రామాంజనేయులు మాట్లాడారు. పట్టణంలో మహిళల మరుగుదొడ్లను శుభ్రపరచడంలో నీటి సమస్య అధికంగా ఉండడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే దుర్గాపేటలో సిద్ధప్ప గుడి సమీపంలో గల నీళ్ల ట్యాంకు పైకప్పు పడిపోయి దాదాపు రెండేళ్లు అయ్యిందన్నారు. కౌన్సిలర్ల సర్వసభ్య సమావేశంలో సంబంధిత అధికారులకు ఈ విషయం తెలియజేసినా చర్యలు చేపట్టకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్, ఎన్‌జిఒఎస్ కాలనీ, డ్రైవర్స్ కాలనీ, సుందరయ్య కాలనీ, సుబ్బారెడ్డి నాగర్, ధరణి టౌన్షిప్, బృందావన్ కాలనీ, బుగ్గానపల్లి తదితర కాలనీలలో సిసి రోడ్లు లేక కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కమిషనర్ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. వచ్చే వేసవి నాటికి స్థానిక వాటర్ ట్యాంకులను నిర్మించి ప్రజల దాహార్తిని తీర్చడానికి తగిన చర్యలు చేపట్టాలని ఆయా కాలనీల కౌన్సిలర్లు కోరారు. అలాగే సమస్యాత్మక పరిస్థితులు ఉన్న ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కౌన్సిలర్లు కోరారు. స్పందించిన కమిషనర్ హరిప్రసాద్ చైర్మన్ చలం రెడ్డి మాట్లాడుతూ బేతంచెర్ల పట్టణంలోని ప్రజల దాహార్తిని వేసవి కాలంలో తీర్చడానికి సంబంధిత ఉన్నతాధికారులకు నివేదికలు పంపినట్లు తెలిపారు. అందుకు సరిపడా బడ్జెట్ మంజూరుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. పట్టణంలోని చిరు వ్యాపారస్తులు కిరాణం కొట్టు యజమానులు తోపుడుబండ్ల చిన్న వ్యాపారస్తులు ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించడానికి కృషి చేయాలన్నారు. అందుకు ప్రత్యామ్నాయంగా జూట్ బ్యాగులను, వాతావరణ కాలుష్యానికి కారణమయ్యే బ్యాగులు కాకుండా క్లాత్ కర్ర బ్యాగులను వినియోగించాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ ఇంజనీర్ తేజ, మెప్మా సూర్యనారాయణ, కౌన్సిలర్లు చింతల నాగిరెడ్డి, రామాంజి, రామ్ గోపాల్, ఇబ్రహీం, కొమ్ము మధు, ఎన్ కుమారి, విజయలక్ష్మి, ముబీనా, అబ్దుల్ రెహమాన్, హుస్సేన్ అమ్మ, నాగజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

దొంగ ఓట్లతోనే బిజెపి అధికారంలోకి : కాంగ్రెస్

మీడియాతో మాట్లాడుతున్న రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నాగ మధు యాదవ్

ప్రజాశక్తి - ఆత్మకూరు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అక్రమ పద్ధతులు, దొంగ ఓట్లతోనే అధికారంలోకి వచ్చిందని రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నాగ మధు యాదవ్ అన్నారు. ఆత్మకూరులో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని మండిపడ్డారు. పేద ప్రజల పొట్టకొట్టేలా బీజేపీ నిర్ణయాలు ఉంటే కాంగ్రెస్ చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా కాకుండా, దొంగ ఓట్లను అడ్డం పెట్టుకుని బీజేపీ అధికారంలోకి వచ్చిందని యాదవ్ విమర్శించారు. స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్ పాత్రను, ఇందిరాగాంధీ అందించిన సేవలను ఆయన గుర్తు చేశారు. అటువంటి నాయకుల కష్టాన్ని బీజేపీ తన ఖాతాలో వేసుకోవాలని చూడటం హాస్యాస్పదమన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని త్వరలోనే ప్రజలు ఆ పార్టీకి బుద్ధి చెప్తారని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నంద్యాల పార్లమెంట్ నాయకులు చింతా మోహన్ రావు, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు : ఎస్ఐ

మాట్లాడుతున్న ఎస్ఐ నాగార్జున

ప్రజాశక్తి - ప్యాపిలి

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని ఎస్ఐ నాగార్జున దుకాణా దారులను హెచ్చరించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో డిప్యూటీ ఎంపిడిఒ శివకుమార్ గౌడ్‌తో కలిసి దుకాణాదారులతో ఆయన సోమవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండల కేంద్రంలో మర్చంట్ వ్యాపారస్తులు, కిరాణం, బట్టలు, ఎరువు, పెయింట్, ఎలక్ట్రికల్ షాపులు, తోపుడు బండ్ల వ్యాపారస్తులకు ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన కల్పించారు. దుకాణాల ముందు రోడ్డుపై వాహనాలు ఆపకుండా ఫుట్‌పాత్ వినియోగం, లోడింగ్, అన్‌లోడింగ్ సమయంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా దుకాణదారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో తోపుడు బండ్లకు కేటాయించిన ప్రదేశాల్లోనే ఉంచాలని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూసుకోవాలని సూచించారు. అలాగే రోడ్డుపై ఆవులు, పందులు, కుక్కలతో కలిగే ఇబ్బందులపై యజమానులు బాధ్యత తీసుకోవాలని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంత వరైనా ఉపేక్షించేంది లేదని కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బస్టాండ్ ఆవరణలో విచ్చలవిడిగా ద్విచక్రవాహనాలు నిలిపి బస్సుల రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్న వాహనదారులకు ఇప్పటి వరకు 200 వాహనాలకు పైనే రూ.35 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. సరైన పత్రాలు లేని 30 బైక్‌లను ఆర్‌టిఒ ఆధికారులకు అప్పగించినట్లు తెలిపారు. ప్యాపిలి పోలీసు స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఒకే బైక్‌పై ట్రిబుల్, నలుగురు ప్రయాణించవద్దని హెచ్చరించారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి

చట్ట పరిధిలో న్యాయం చేస్తాం : ఎస్‌పి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పోలీస్ స్పందనలో వచ్చిన సమస్యలపై విచారణ జరిపి ఫిర్యాదుదారులకు చట్ట పరిధిలో న్యాయం చేస్తామని జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎస్‌పి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్‌పి 75 ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ స్వయంగా మాట్లాడి ఫిర్యాదులపై విచారణ జరిపి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట పరిధిలోని సమస్యలకు నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎస్‌పి ఆదేశించారు.

ఫిర్యాదుల్లో కొన్ని... 'నేను జనవరి 2025 నుండి అక్టోబర్ వరకు నంద్యాల పట్టణంలోని ఒక ప్రైవేటు జూనియర్ కళాశాలలో పని చేశాను. నాకు ఇంత వరకు జీతం ఇవ్వకపోగా కళాశాల ప్రిన్సిపల్ సుబ్బయ్య అనుచితంగా అమర్యాదగా ప్రవర్తిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. నాకు న్యాయం చేయండ'ని పి. మల్లికార్జునయ్య జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అలాగే ఓ ఎఎన్ఎం, బండి ఆత్మకూరుకు గ్రామానికి చెందిన శ్రీనివాసులు, నూనెపల్లె సాదిక్ నగర్‌కు చెందిన బాదుల్లా సమస్యలు పరిష్కరించాలని ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

మహిళా చట్టాలపై అవగాహన ఉండాలి : సిఐ

మాట్లాడుతున్న సిఐ ఇంతియాజ్ బాష

ప్రజాశక్తి - ప్యాపిలి

మహిళా చట్టాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని డోన్ సిఐ ఇంతియాజ్ బాష అన్నారు. నంద్యాల జిల్లా ఎస్పీ, డోన్ డిఎస్పి ఆదేశాల మేరకు పట్టణంలోని వెంకటేశ్వర డిగ్రీ కాలేజీలో మహిళా రక్షణ, బాల్య వివాహాలు, రోడ్డు యాక్సిడెంట్స్, యువత మత్తు పదార్థాల వలన జరిగే నష్టాల గురించి డోన్ పట్టణ సిఐ ఇంతియాజ్ బాష ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు ఎల్ఈడి స్క్రీన్‌లో వీడియోస్ చూపిస్తూ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సిఐ ఇంతియాజ్ బాష మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు వీటివల్ల జరిగే నష్టాన్ని వివరిస్తూ బాగా చదువుకొని ఉన్నత స్థాయిలో ఉండాలని సూచించారు. అంతేకాక అమ్మాయిలకు రాకపోకల్లో ఏదైనా ఇబ్బంది ఉంటే తమ దృష్టికి కానీ శక్తి టీం దృష్టికి గాని కాలేజీ యజమాన్య దృష్టికి కానీ తీసుకొని రావాలన్నారు. తమలో తామే బాధపడుతూ ఉండడం మంచిది కాదని, ఎవరికో ఒకరికి చెబితే వచ్చిన సమస్య మరొక సారి రాకుండా పరిష్కారం చేసే దిశగా చర్యలు చేపడతామన్నారు. అమ్మాయిలకు సమస్య సృష్టించేవారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తి ఉండదని అట్టివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు. అమ్మాయిలు అత్యవసరమైతే 100, 112 నెంబర్లకు ఫోన్ చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో శక్తి టీం ఉమెన్ కానిస్టేబుల్ లక్ష్మి, కాలేజీ యాజమాన్యం పాల్గొన్నారు.

దుకాణాల్లో ఎరువుల వివరాలు ప్రదర్శించాలి : ఎఒ

ప్రజాశక్తి - బేతంచెర్ల

ఎరువుల దుకాణా యజమానులు ఎరువులు, యూరియాకు సంబంధించిన వివరాల పట్టికలను వారివారి షాపుల్లో తప్పనిసరిగా ప్రదర్శించాలని ఎఒ విజయ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. బేతంచర్ల పట్టణంలోని ఎరువుల దుకాణాలను ఆయన సోమవారం తనిఖీ చేసి మాట్లాడారు. కంది పంట సాగు చేసి ఈ పంటలో కంది పంట నమోదు చేసుకున్న రైతులు రైతు సేవా కేంద్రాలలో సందర్శించి అక్కడ కంది పంట కొనుగోలు కోసం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. అలాగే ప్రస్తుతం ప్రభుత్వం కంది పంటను క్వింటాకు రూ. 8వేల మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాలు సద్వినియోగం చేసుకొని సహకరించాలని తెలిపారు. ఎరువుల దుకాణాల యజమానులతో ఆయన మాట్లాడుతూ తప్పనిసరిగా బ్యానర్ రూపంలో షాపులలో ఏయే ఎరువులు ఉన్నాయి, ఏ ధర ఎంత ఉంది అనే సూచన పట్టికలను తప్పనిసరిగా ప్రదర్శించాలని, లేని ఎడల చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం : సిడిపిఒ

మాట్లాడుతున్న సిపిడిఒ కోటేశ్వరమ్మ

ప్రజాశక్తి - ఆత్మకూరు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఆత్మకూరు సిడిపిఒ కోటేశ్వరమ్మ అన్నారు. అర్బన్ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో సిడిపిఒ కోటేశ్వరమ్మ ఆధ్వర్యంలో పోషణ, బాల్య వివాహముక్త్ భారత్‌పై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఈ వివాహాలను ప్రోత్సహించే వారిపై కేసు నమోదు అవుతుందన్నారు. బాల్య వివాహాల చట్టాలపై ప్రజలలో అవగాహన పెంచాలన్నారు. ప్రతి అంగన్వాడీ పరిధిలోని కిషోర్ బాలికల తల్లిదండ్రులకు అంగన్వాడీ సిబ్బంది బాల్య వివాహాలపై కలిగే అనర్థాలను వివరించాలని సూచించారు. మహిళల్లో రక్తహీనత రాకుండా ఆకుకూరలు, కాయగూరలు తీసుకోవాలన్నారు. పిల్లల పోషణ గురించి తల్లులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో ముస్తాబు కార్యక్రమం ప్రారంభించారు. అద్దం, దువ్వెన, సోప్, టవల్ ప్రతి సెంటర్‌లో ఉంచాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ కోమల, గర్భిణులు, బాలింతలు, తల్లులు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

శ్రీవెంకటేశ్వర స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే



ఆలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు మండలం బొల్లవరం గ్రామంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే గిత్త జయసూర్య, నంద్యాల పార్లమెంటు టిడిపి ఇన్‌ఛార్జ్ మాండ్ర శివానందరెడ్డి సోమవారం దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయాన్ని దర్శించుకొని వేద పండితుల మంత్రోచ్ఛరణతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట నందికొట్కూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి, ఖాతా రమేష్ రెడ్డి, సర్వోత్తమ్ రెడ్డి, కడియం వెంకటేశ్వర్లు యాదవ్ ఉన్నారు.

హుండీ లెక్కింపులోరూ 29,58,535 లక్షల నగదు

- బంగారం 35 గ్రాములు - వెండి 160 గ్రాములు

హుండీ లెక్కిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం యాగంటిశ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానం హుండీని సోమవారం లెక్కించినట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి డి. పాండురంగా రెడ్డి, వెలుగోడు దేవస్థానంల ఇఒ జనార్ధన్‌లు తెలిపారు. ఇందులో నగదు రూ.29,58,535లక్షలు, బంగారం 35 గ్రాములు, వెండి 160 గ్రాములు లభించిందన్నారు. 80 రోజులకు సంబంధించిన లెక్కించిన హుండీలో ఈ మొత్తం లభించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో యాగంటి పల్లె ఉప సర్పంచి బండి మౌళీశ్వరరెడ్డి, ఎం. భరతుడు, పి. శ్రీరాములు, రామశేఖర్, అర్చకులు, ఆలయ సిబ్బంది, శ్రీ రామ సేవా సమితి సేవకులు, పోలీసు అధికారులు, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ప్రగతి బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

రైతు నాయకుడిపై పిడి యాక్ట్‌ను రద్దు చేయాలి

- ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్ రావు

ఫోటో రైట్ ఎప్. సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - పాములపాడు

అనకాపల్లి జిల్లా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూ నిరంతరం ప్రజా సమస్యలు, రైతన్న సమస్యలపై పోరాటం చేస్తున్న అప్పలరాజుపై బనాయించిన పిడి యాక్ట్‌ను రద్దు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి వెంకటేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డి సోమన్న, సిఐటియు మండల కార్యదర్శి మేకల రాజు అన్నారు. సిపిఎం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజా ప్రయోజనాలకి హాని కలిగించే బల్క్ డ్రగ్ పార్క్‌కు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న అప్పలరాజుపై ఉద్దేశపూర్వకంగా పిడి యాక్ట్ పెట్టి తన అడ్డును తొలగించుకోవాలని ప్రభుత్వం భావించడం అన్యాయమన్నారు. ఎస్సీ, ఎస్టీ పేద రైతుల భూములన్నీ కార్పొరేట్లకు కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తూ పోరాటం చేస్తున్నందుకు ఇది జీర్ణించుకోలేని ప్రభుత్వం ఆయన మీద పిడి యాక్ట్ పెట్టి జైలు పాలు చేయడం అన్యాయమని దుయ్యబట్టారు. బ్యాంకులు దోచుకున్న వాళ్ళు, గూండాలు, రౌడీలు అక్రమ వ్యాపారాలు చేస్తున్న వాళ్లు అందరూ అసెంబ్లీ లోపల, బయట స్వేచ్ఛగా తిరుగుతుంటే ప్రజల కోసం మాట్లాడే వాళ్ల గొంతు నొక్కి లోపల పెట్టడం అన్యాయమన్నారు. పిడి యాక్ట్ అంటే ప్రజల మాన ప్రాణాలు, ధన దుర్వినియోగం చేసే వారిపై, దేశద్రోహులపై పెడతారు కాని.. ఉద్యమకారులపై పిడి యాక్ట్ కేసులు పెట్టడం ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రజల పక్షాన పోరాటం చేసే వారిపై అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. ఇది భవిష్యత్తులో ప్రజల కోసం నిలబడే వాళ్లని అణిచివేసే పని అని దీన్ని ప్రజాతంత్ర వాదులందరూ వ్యతిరేకిస్తున్నారన్నారు. వెంటనే అప్పలరాజుపై పెట్టిన పిడి యాక్ట్‌ను ఎత్తివేసి ఆయనను వెంటనే విడుదల చేయాలని లేని ఎడల రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు ఉధృతం చేసి ప్రజా ఉద్యమాలతో బుద్ధి చెప్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

హలో కార్మిక... చలో విశాఖ

బనగానపల్లె : మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లయ్య

ప్రజాశక్తి - బనగానపల్లె

విశాఖపట్నంలో ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకు నిర్వహించే సిఐటియు 18వ అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై. ఎల్లయ్య, జిల్లా సహాయ కార్యదర్శి శివరాంలు పిలుపునిచ్చారు. హలో కార్మిక.. చలో విశాఖ అంటూ బయలుదేరిన సిఐటియు జీపు జాత సోమవారం బనగానపల్లెకు చేరుకుంది. పట్టణంలోని పెట్రోల్ బంకు కూడలిలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగులు, కార్మికులు, కర్షకులు, మేధావులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేస్తూ ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు జీపు జాతను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు డివిజన్ అధ్యక్షులు జీవి సుబ్బయ్య, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు గోపాల్, విబివిఎల్ సంఘం నాయకులు ప్రసాద్, మధు, సాయి పాల్గొన్నారు.

పాములపాడు : విశాఖపట్నంలో జరిగే సిఐటియు మహాసభలకు లక్షలాది మంది హాజరై జయప్రదం చేయాలని సిఐటియు మండల అధ్యక్షులు బి శివ లక్ష్మమ్మ, కార్యదర్శి మేకల రాజు కోరారు. స్థానిక సిపిఎం కార్యాలయం ముందు సిఐటియు జెండాను అంగన్వాడీ టీచర్ రమాదేవి సోమవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, అంగన్వాడీ కార్యకర్తలకు, ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ. 26 వేల ఇవ్వాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రైవేటీకరణను అడ్డుకోవాలని, కార్మికుల కర్షకుల పై చేస్తున్న దాడుల పైన మహాసభల్లో చర్చించనున్నట్లు తెలిపారు. లక్షల మంది పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు డి. స్వామన్న, టి. వెంకటేశ్వర్లు, వెంకట లక్ష్మమ్మ, సర్వర్ కుమారి, తులసమ్మ, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పాములపాడు : సిఐటియు జెండాను ఆవిష్కరిస్తున్న అంగన్వాడీ టీచర్ రమాదేవి

బేతంచెర్ల : కార్మికులను బానిసలుగా చేసే కార్మిక స్వేచ్ఛను కాలరాయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు ఉద్యమిస్తామని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై ఎల్లయ్య, జిల్లా నాయకులు జి శేఖరాణి, శివరాంలు అన్నారు. ఈ నెల 31 నుండి జనవరి 4 వరకు విశాఖపట్టణంలో జరిగే సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలనే కార్యక్రమంలో భాగంగా చేపట్టిన సిఐటియు జిల్లా ప్రచార జాతకు బేతంచెర్లకు చేరుకుంది. ప్రచార జాతకు బేతంచెర్ల మండలంలోని కార్మిక సంఘాలు లారీ వర్కర్స్ యూనియన్, హమాలీ వర్కర్స్ యూనియన్, ఆటో వర్కర్స్ యూనియన్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. స్థానిక పాత బస్టాండ్ భారత్ బేకరి సర్కిల్‌లో వారు మాట్లాడుతూ కార్మికుల ప్రాణాలు పణంగా పెట్టి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యవస్థను పెట్టుబడిదారులకు భూస్వాములకు తాకట్టు పెట్టి కార్మికులను కట్టు బానిసలుగా చేసేందుకు కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా దొడ్డిదారిలో జీవోలు జారీ చేయడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లారీ వర్కర్ సీరియల్ అధ్యక్షులు బి రామాంజనేయులు, దోస్ సిఐటియు నాయకులు పి రామాంజనేయులు, నాగమద్దయ్య, రామకృష్ణ, వెంకటేష్ నాయక్, రామల్లకోట మద్దయ్య, స్వామి నాయుడు, ఆసన్ బాషా, వన్నూరు బాషా, వెంకటరమణ, సుబ్బరాయుడు, టింగు, నాగరాజు, శ్రీదేవి, విజయలక్ష్మి, మధురవాణి, అనూష, రమణమ్మ, అరుణ, మసీమద్దయ్య, రంగడు, ఉసేని, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన స్టాల్

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యానికి శ్రేయస్కరం

ప్రజాశక్తి - చాగలమర్రి

ప్రకృతిలో పండించిన పంటలను ఆహారంగా తీసుకోవడం ఆరోగ్యానికి శ్రేయస్కరమని ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌ఛార్జ్ పి. నాగేశ్వర్‌రెడ్డి, ఎంపిడిఒ కార్యాలయ సీనియర్ సహాయకులు బాల నరసింహులు పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కూరగాయలు, ఆకుకూరల స్టాల్స్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల పట్ల ప్రజలు చూపిన స్పందనపై నిర్వాహకులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానాలు భూసారాన్ని కాపాడుతూ తక్కువ ఖర్చుతో సాగు చేయడానికి దోహదపడతాయని తెలిపారు. పర్యావరణ సమతుల్యతను నిలబెట్టడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. సహజంగా పండిన ఆహార పదార్థాల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ రూపస్ రాజ్, కమ్యూనికేషన్స్ ఎన్ఎఫ్ఎ అభిషేక్ రాజ్, జిఎస్‌డబ్ల్యూఎస్ సిబ్బంది పర్వీన్, హరిత, నిరంజన్, ఐసీఆర్పీలు బాషా, లక్ష్మీ నరసమ్మ పాల్గొన్నారు.

వైభవంగా పల్లకి సేవ మహోత్సవం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో పల్లకి సేవ మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. దేవస్థానంలో ఉమామహేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు ప్రదోషకాల ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను పల్లకి లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి పాండురంగారెడ్డి, పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వర రెడ్డి, యాగంటి పల్లె ఉపసర్పంచ్ బండి మౌళీశ్వర రెడ్డి, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశైలంలో నేడు ముక్కోటి ఏకాదశి ఉత్సవం

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

బనగానపల్లె : ఏర్పాట్లను పరిశీలిస్తున్న సిఐ ప్రవీణ్ కుమార్

శ్రీశైల పుణ్య క్షేత్రంలో మంగళవారం ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ స్వామి అమ్మవార్లకు ప్రత్యేక ఉత్సవం నిర్వహించనున్నారు. ఈ ఉత్సవం సందర్భంగా వేకువ జామున శ్రీస్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉత్తర ద్వార దర్శనం, రావణ వాహనసేవ నిర్వహిస్తారు. ఉత్సవంలో భాగంగానే ఉత్సవమూర్తులను స్వామివారి ఆలయ ముఖమండప ఉత్తర ద్వారం నుండి వెలుపలకు తోడ్కొనివచ్చి ఆలయ ఉత్తర భాగంలో రావణ వాహనంపై ఆశీనులను చేసి ప్రత్యేక పూజలు చేపట్టనున్నారు. ముక్కోటి ఏకాదశి రోజు ఉదయం 3గంటలకు ఆలయ ద్వారాలను తెరచి మంగళవాయిద్యాల అనంతరం 3.30నిమిషాలకు స్వామి వారికి సుప్రభాతసేవ, తరువాత శ్రీ స్వామి అమ్మవార్లకు ప్రాతఃకాల పూజలు నిర్వహించి 4.30గంటలకు స్వామివారికి, అమ్మవారికి మహామంగళ హారతులు నిర్వహించనున్నారు. అనంతరం ఉదయం 5.30నిలకు రావణ వాహనసేవ నిర్వహించనున్నారు. ఆ తర్వాత శ్రీస్వామి అమ్మవార్ల గ్రామోత్సవం, ఉదయం 6గంటల తర్వాత దర్శనాలు, ఆర్జితసేవలు ప్రారంభమవుతాయి.

నేడు చెంచుగిరిజనులకు ఉచిత స్పర్శ దర్శనం..

ముక్కోటి ఏకాదశి సందర్భంగా చెంచుగిరిజనులకు మంగళవారం ఉచిత స్పర్శ దర్శనం కల్పించనున్నట్లు ఛైర్మన్ పోతుగంటి రమేష్ నాయుడు, ఇఒ ఎం. శ్రీనివాసరావులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి నెలలోనూ ఒకరోజు చెంచుగిరిజనులకు ప్రత్యేకంగా శ్రీ స్వామివారి ఉచిత స్పర్శదర్శనం కల్పించాలని నిర్ణయించినట్లు వారు తెలిపారు. ఉదయం 11గంటలకు పాత విరాళాల కేంద్రం క్యూ లైన్ నుంచి చెంచులకు ఉచిత స్పర్శ దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. శ్రీశైలక్షేత్ర సంస్కృతీ సంప్రదాయాల్లో చెంచులకు ఎంతో విశేషస్థానముందన్నారు. గిరిజన చెంచు భక్తులు శ్రీ భ్రమరాంబాదేవిని తమ కూతురిగా, శ్రీ మల్లికార్జునస్వామిని తమ అల్లునిడిగా భావిస్తారన్నారు. శ్రీస్వామి ఉచిత స్పర్శ దర్శనానికి చెంచుగిరిజన భక్తులను ఎంపిక చేయడంలో స్థానిక ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సహకారాన్ని తీసుకున్నట్లు తెలిపారు.

ఆళ్లగడ్డ : ప్రముఖ పుణ్య క్షేత్రమైన అహోబిలం లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లు పూర్తయ్యాయని మఠం ప్రతినిధులు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ మంగళవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తుల కోసం ఉత్తర ద్వార దర్శనాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉత్తర ద్వారం వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి, మండపాలను నిర్మించి ప్రత్యేక అలంకరణలు చేశారు. వైకుంఠ ద్వార దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. **రుద్రవరం :** రుద్రవరం మండల సమీపంలోని వాసాపురం వెంకటేశ్వర స్వామి దేవస్థానం, మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానాల్లో జరుగుతున్న వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను సీఐ దస్తగిరి బాబు సోమవారం పరిశీలించారు. భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లను ఆయన నిశితంగా పరిశీలించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పటిష్టమైన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్ఐ జయప్ప, ఏఎస్ఐ బాలన్న పాల్గొన్నారు.

మంత్రి బిసి దంపతుల ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశి వేడుకలకు

బనగానపల్లె : పట్టణంలోని కొండపేట కొట్నాల వెంకటేశ్వర స్వామి ఆలయం నేడు జరగనున్న వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లకు సన్నాహాలు పూర్తయ్యాయి. రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ బీసీ జనార్ధనరెడ్డి, ఆయన సతీమణి బీసీ ఇందిరారెడ్డిల పర్యవేక్షణలో సోమవారం రాత్రికి ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. ఆలయం నిర్మాణం చురుకుగా జరుగుతున్న నేపథ్యంలో ప్రాంగణంలో భారీ వేదికను ఏర్పాటు చేసి, భక్తులు ఉత్తరద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకునేలా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. క్యూలైన్లను ఏర్పాట్లను పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ పరిశీలించారు. ఐదు గంటలకు భక్తులకు స్వామివారి దర్శనాలకు అనుమతిస్తామని పూజారి మల్లికార్జున శాస్త్రి తెలిపారు. స్వామివారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి దంపతులు తమ సొంత ఖర్చుతో ప్రసాదాలను అందజేయనున్నారు.

కేక్‌ల తయారీలో కలర్స్ తక్కువ వాడండి

- ఫుడ్ సేఫ్టీ అధికారులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

కేక్‌లను పరిశీలిస్తున్న అధికారులు

జనవరి ఫస్ట్‌కు సంబంధించి కేకులు ఎక్కువ ప్రజలు వాడుతారు కాబట్టి బేకరీ యజమానులు, కేక్‌ల తయారీదారులు కలర్స్ తక్కువ మోతాదులో వేసి తయారు చేయాలని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ఒ. వెంకట రాముడు హెచ్చరించారు. సోమవారం నంద్యాల పట్టణంలోని పలు కేక్ తయారీ కేంద్రాలను, బేకరీలను ఫుడ్ సేఫ్టీ అధికారులు వెంకట రాముడు, కాశీంవలిలు ఆకస్మిక తనిఖీ చేశారు. పలు కేక్ లను, బన్నులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ కేకులు తూకంలో అక్రమాలు లేకుండాఇవ్వాలన్నారు.

వసతి గృహ విద్యార్థులకు 'ముస్తాబు కిట్లు' : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జిల్లాలోని 155 వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు 'ముస్తాబు కిట్లు' అందజేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ భవనంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు కలెక్టర్, జాయింట్ కలెక్టర్లను కలిసేందుకు వచ్చే జిల్లా అధికారులు ఎవరూ బొకేలు, కేకులు, శాలువలు తీసుకురావద్దని స్పష్టంగా ఆదేశించారు. వాటికి ప్రత్యామ్నాయంగా విద్యార్థుల పరిశుభ్రతను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పాఠశాలలో 'ముస్తాబు కార్నర్' ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కానుకల స్థానంలో 'ముస్తాబు కిట్లు' అందజేసే విధంగా జిల్లా అధికారులు సహకరించాలని కోరారు. ఈ కిట్లలో అద్దం, దువ్వెన, నెయిల్ కట్టర్, హ్యాండ్‌వాష్, శానిటైజర్ వంటి అవసరమైన వస్తువులు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ విధంగా సేకరించిన ముస్తాబు కిట్లను జిల్లాలోని వసతి గృహాల్లోని విద్యార్థులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అలాగే 20 మందికి పైగా కార్మికులు విధులు నిర్వహిస్తున్న ప్రైవేటు కర్మాగారాలు, పాఠశాలలు, ఆసుపత్రులు తదితర సంస్థలు తప్పనిసరిగా ఈపిఎఫ్ఓలో నమోదు చేయాలన్నారు. సంబంధిత ఉద్యోగులు ప్రధానమంత్రి విక్షిత్ భారత్ రోజ్‌గార్ యోజన (పీఎంవీబీఆర్ వై) కింద నమోదు చేసుకోవడం ద్వారా ఉద్యోగ సంస్థలకు, ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి ఇన్సెంటివ్ రూపంలో ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులతో పాఠశాల కరస్పండెంట్ సుధాకర్

చేతిరాత అందంగా ఉండాలి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : చేతిరాత అందంగా ఉండాలని, లేకుంటే చదువులో రాణించలేరని శాంతినికేతన్ విద్యాసంస్థల అధినేత సూర్యదేవర సుధాకర్ అన్నారు. నంద్యాల క్రాంతి నగర్ నందు శ్రీ శాంతినికేతన్ సిబిఎస్ఇ విద్యా సంస్థల్లో సోమవారం శ్రీ శాంతినికేతన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్, శ్రీ సంకల్ప విద్యాసంస్థల విద్యార్థులకు చేతిరాత (ఇంటర్ స్కూల్ హ్యాండ్ రైటింగ్ కాంపిటీషన్) పోటీలు నిర్వహించారు. అనంతరం మంచి చేతిరాత రాసిన విద్యార్థులకు బహుమతులను సూర్యదేవర సుధాకర్ ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాత్మ గాంధీజీ చెప్పినట్లుగా ఎంతసేపు అద్దం ముందు నిలబడి మేకప్ చేసుకున్న పెదవులపై చిరునవ్వు లేకపోతే ఆ మేకప్ పూర్తి కానట్టేనని, ఎన్ని చదువులు చదివినా సరే చేతిరాత సరిగా లేకపోతే మీ చదువులు పూర్తికానట్టే అన్నారు. నేటి పరీక్ష విధానంలో ఆబ్జెక్టివ్ ప్రశ్నలకన్నా డిస్క్రిప్టివ్ ప్రశ్నలే ఎక్కువగా ఉన్నాయని, కాబట్టి పరీక్షల్లో మంచి మార్కులు సంపాదించాలంటే మంచి చేతిరాత చాలా అవసరమన్నారు.

అన్నమ్మయ్య కీర్తనల అక్షరాలతో వెంకటేశ్వర స్వామి చిత్రం

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు కోటేష్ వైకుంఠ ఏకాదశిని పురస్కరించు కొని అన్నమయ్య పాడిన కీర్తనల తెలుగు అక్షరాలతో వెంకటేశ్వర స్వామి చిత్రాన్ని వేశారు. ఏ3 డ్రాయింగ్ చార్టు మీద ఎటువంటి గీతలు లేకుండా కలర్ పెన్నులతో, వాటర్ కలర్స్‌తో 3 గంటల సమయంలో వేసి ఆకట్టుకున్నారు.

మార్కెట్ కమిటీ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : నంద్యాల జిల్లా మార్కెట్ కమిటీ ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను కడప రీజినల్ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు సోమవారం కడపలోని కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిడిఎం లావణ్య, మార్కెట్ కమిటీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోరంట్ల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి సురేష్, ఉపాధ్యక్షుడు రాజశేఖర్ తదితరులు పాల్గొని అసోసియేషన్ సభ్యులందరికీ ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ చేస్తున్న కడప రీజినల్ జాయింట్ డైరెక్టర్

31న అవ్వతాతలకు పింఛన్ల పంపిణీ

- వందశాత పూర్తి చేయాలి : కలెక్టర్ జి.రాజకుమారి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఈ నెల 31వ తేదీన పింఛన్‌దారులకు ఇంటింటికి వెళ్లి పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పలు అంశాలపై ఆర్డీవోలు, తహసిల్దార్‌లు, ఎంపీడీవోలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీన జిల్లాలో ఉన్న అర్హులందరికీ వంద శాతం పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. పింఛన్ల పంపిణీపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల పరిధిలో ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలన్నారు. చెత్త సేకరణలో పారిశుధ్య కార్మికులు నిర్లక్ష్యం చేయరాదన్నారు. జిల్లాలో వివిధ గ్యాస్ ఏజెన్సీలలో పనిచేస్తున్న గ్యాస్ డెలివరీ బాయ్‌లు ఇంటింటికి గ్యాస్ సిలిండర్లు డోర్ డెలివరీ చేసే సమయంలో ఇంటి యజమానుల నుండి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. గ్యాస్ బాయ్‌లు ఒక్క రూపాయి కూడా ఎక్కువ డబ్బులు వసూలు చేయరాదన్నారు. శ్రీ శక్తి పథకం మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ పథకంలో ప్రయాణికులకు ఆర్టీసీ బస్టాండ్లలో మెరుగైన వసతులు కల్పించాలన్నారు. ఆర్టీసీ బస్టాండు పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకొని ప్రయాణికులకు మంచినీటిని అందుబాటులో ఉంచాలన్నారు.

ప్రజా సమస్యలకు ఖచ్చిత పరిష్కారం : కలెక్టర్ జి.రాజకుమారి

ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి అర్జీకి ఖచ్చితమైన పరిష్కార మార్గం చూపాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన రెవిన్యూ అర్జీదారుల మినహా 151 మంది దరఖాస్తుదారుల నుండి నుంచి జిల్లా కలెక్టర్ నేరుగా అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి స్పష్టమైన, ఖచ్చితమైన పరిష్కార మార్గాలు చూపాలని అధికారులకు సూచించారు. అర్జీదారుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో అధికారులు మరింత చొరవతో ప్రతి దరఖాస్తును నాణ్యతతో పాటు వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీల పరిష్కార ప్రక్రియను రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా జిల్లాలను సందర్శించి పర్యవేక్షించనున్న దృష్ట్యా అధికారులు మరింత బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. రీ-ఓపెన్ దరఖాస్తులు, బియాండ్‌ఎస్ఎల్ఏలో ఉన్న అర్జీలు, విఐపి గ్రీవెన్స్‌లను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఆడిట్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్ణీత కాలపరిమితిలోగా వాటిని క్లియర్ చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు.

వికలాంగ వృద్ధురాలి పింఛన్ కోసం దరఖాస్తు స్వీకరిస్తున్న కలెక్టర్

మాట్లాడుతున్న వృద్ధురాలు

పింఛన్ ఇప్పించండి సారూ..

ప్రజాశక్తి - శిరివెళ్ల

మండలంలోని చెన్నూరు గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన పాణ్యం మరియమ్మ తనకు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని సోమవారం నంద్యాలలోని కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసింది. స్థానిక మీడియాతో వృద్ధురాలు మాట్లాడుతూ తనకు 80 సంవత్సరాలు ఉన్నాయని, పింఛన్ కోసం స్థానిక అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. తన భర్త ఆనందరావు మృతి చెంది ఏడాదిన్నర అవుతుందన్నారు. నాటి నుండి ప్రభుత్వ పింఛన్ కోసం గ్రామ సచివాలయం, మండల ప్రజాపరిషత్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వితంతు పింఛన్ అందించి ఆదుకోవాలని కోరారు.

మట్టి అక్రమ తవ్వకాలను ఆపండి

కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యేలకు వినతి

ప్రజాశక్తి - శిరివెళ్ల

శిరివెళ్ల మండలం మహాదేవపురం గ్రామంలో పోలేరమ్మ రస్తా, పొలాలకు, సర్వ నరసింహస్వామి ఆలయానికి రాకపోకలకు సౌకర్యంగా ఉన్న రస్తాలో కొందరు అక్రమంగా జెసిబి యంత్రాలతో మట్టిని తోడేసి ఇతర ప్రాంతాలకు తరలించి అమ్ముకుంటున్నారని, తవ్వకాలను తణక్షమే ఆపాలని వైసిపి జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి డిమాండ్ చేశారు. మట్టి తవ్వకాలను వెంటనే ఆపాలని కోరుతూ సోమవారం మహాదేవపురం గ్రామస్తులతో కలిసి వారు జిల్లా కలెక్టర్ రాజకుమారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు మండల స్థాయి అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోడం లేదన్నారు. ఈ నెల 14న, 26వ తేదీ అర్ధరాత్రి పోలేరమ్మ రస్తా మట్టిని జెసిబితో తవ్వేశారన్నారు. మట్టి వ్యాపారులు అర్ధరాత్రి అలజడులు సృష్టిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. రాత్రి పూట పోలేరమ్మ రస్తాను తవ్వి మట్టిని టిప్పర్ల ద్వారా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఎంపీడీఒ సి.శివ మల్లేశ్వరప్ప రోడ్డు అభివృద్ధికి ఇచ్చిన తీర్మానం లెటర్ ఆసరాగా చేసుకుని పూర్వం నుండి ఉన్న పోలేరమ్మ రస్తా ధ్వంసం చేస్తున్నారని అన్నారు. తహశీల్దార్‌ని కలిసి మట్టి వ్యాపారులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరగా మట్టి తవ్వకాలు ఆపాలని స్థానిక పోలీసులకు తెలియజేశారు. జిల్లా ఎస్పీకి, కలెక్టర్‌కి, స్థానిక పోలీసులకు, తహశీల్దార్‌కి తెలియజేసినప్పటికీ ప్రేక్షకపాత్ర వహించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలేరమ్మ రస్తాను ధ్వంసం చేసి అక్రమంగా మట్టిని తరలించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, జెసిబి యంత్రాలను, టిప్పర్లను, ట్రాక్టర్లను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

జెసిబితో మట్టిని తవ్వేసిన దృశ్యం

గ్రామ సభల ద్వారా కొత్త పాసుపుస్తకాలు

ప్రజాశక్తి - గోస్పాడు

గ్రామ సభల ద్వారా కొత్త పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ చేపడుతున్నట్లు తహశీల్దార్ షేక్ మొహిద్దీన్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాలలో జరిగే సభల ద్వారా రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని జనవరి 2వ తేదీ శుక్రవారం కానాలపల్లి, 3, 5, 6, 7, 8వ తేదీలలో వరుసగా సాంబవరం, చింతకుంట్ల, పసురపాడు, తేళ్ళపురి, క్రిష్ణాపురం గ్రామాలలో, చివరగా రాయపాడు, నాగులవరం గ్రామాలలో 9వ తేదీ రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొంటారని తెలిపారు.

మాలధారుల పాదయాత్ర

ప్రజాశక్తి - రుద్రవరం

మండల కేంద్రంలోని వాసాపుర వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో గోవింద మాలధారణ ఉత్సవాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. సోమవారం కొండమాయపల్లె గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో 15 మంది భక్తులు ఇరుముడి కట్టుకుని కోలాట ప్రదర్శనల మధ్య రుద్రవరం మీదుగా వాసాపురం వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నంద్యాలకి చెందిన డాక్టర్ హరినాథ్ రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులందరికీ ఆలయ చైర్మన్ సింగతల మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. 21 రోజుల దీక్ష పూర్తి చేసుకున్న భక్తులు, రేపు వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారికి ఇరుముడులు సమర్పించి మాల విరమణ చేయనున్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు మరియు గ్రామ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యాగంటిలో పంచాయతీరాజ్ జాయింట్ సెక్రెటరీ

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ జాయింట్ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం యాగంటి దేవస్థానానికి వచ్చిన పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రెటరీ రాజేష్ కుమార్ సింగ్‌కు ఆలయ కార్య నిర్వహణ అధికారి పాండురంగారెడ్డి, పూజారులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం రాజేష్ కుమార్ సింగ్ కుటుంబ సభ్యులు ఉమామహేశ్వరులకు, నందీశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం మర్యాదలతో ఘనంగా సత్కరించి, ఉమా మహేశ్వరుల చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బాల ఆంజనేయులు, పాతపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి శకుంతల, యాగంటిపల్లె ఉప సర్పంచ్ బండి మౌళీశ్వర రెడ్డి పాల్గొన్నారు.



దేవస్థానంలో పంచాయతీ రాజ్ జాయింట్ కార్యదర్శి

టిడిపి కార్యకర్త మృతి

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణంలోని కొత్త ఎస్సీ కాలనీకి చెందిన టిడిపి కార్యకర్త, భూమా కుటుంబ అభిమాని మేడిదిన్నె పాపన్న (55) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు, నంద్యాల పార్లమెంటరీ బిసి సెల్ స్పోక్‌పర్సన్ సల్లా నాగరాజు యాదవ్ కాలనీకి చేరుకుని పాపన్న మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. సంతాపం తెలిపిన వారిలో టిఎన్‌టియూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నర్సింహుడు, నియోజకవర్గ సిసిఎల్ ఉపాధ్యక్షుడు కపినేని ఓబులేసు, దూదేకుల సంఘం మండల అధ్యక్షులు టైలర్ భాష, వెంకటయ్య, పీరయ్య, మోహన్ తదితరులు ఉన్నారు.

నివాళ్లులర్పిస్తున్న సల్లా నాగరాజు